కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
సోమవారం 25, మే 2026 16 పేజీలు



# నిప్పుల కుంపటిగా మారిన జమ్మికుంట..

## వడదెబ్బతో ఐదుగురి మృతి..

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** గత వారం రోజులుగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలో భానుడి భగభగలతో ఐదు మండలాల పరిధిలో గ్రామాలు నిప్పుల కుంపటిగా మారాయి. ఆదివారం జమ్మికుంట మండలంలో

2లో..




# సిండికేట్.. గోల్ మాల్..!

**కరీంనగర్ కార్పొరేషన్, ప్రభాతవార్త :** కరీంనగర్ నగరపాలక సంస్థలో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) ప్రత్యేక నిధులపై చర్చ మొదలైంది. నగరంలో విలీనమైన గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కేటాయించిన కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు అసలు లక్ష్యాన్ని వీడి పక్కదారి పడుతున్నాయానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు స్పెషల్ ఆఫీసర్ హయాంలో రూపకల్పన చేసిన పాత టెండర్లను రద్దు చేయడం, మరోవైపు కొత్త పాలకవర్గం రాగానే అత్యంత వేగంగా కొత్త పనులకు తెరలేపడం వెనుక మతలబు ఏమిటనే ఆరోపణలు నగరంలో వినిపిస్తున్నాయి.




2లో..

విలీన గ్రామాల నిధులు..నగరమంతా పనులకా...?
పాత టెండర్లకు..కొత్త పాలకవర్గం బ్రేకులు..!
87 పనులకు కొత్త టెండర్లు...

### కొత్త బోర్డు రాగానే బ్రేకులు..!

గతంలో స్పెషల్ ఆఫీసర్ పాలన సాగుతున్న సమయంలో నగరంలో విలీనమైన శివారు గ్రామాల మోలిక వసతులే లక్ష్యంగా దాదాపు రూ. 50 కోట్ల మేర యుఐడిఎఫ్ నిధులతో అభివృద్ధి పనులను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలే ప్రధాన



2లో..

# రాష్ట్రంలో భారీ స్థాయిలో.. ధాన్యం దిగుబడి

- అనేక సవాళ్ళ మధ్య ధాన్యం కొనుగోలు చేశాం
- పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- 24గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు
- మే నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు 100 శాతం పూర్తి చేయాలి
- 21 కోట్ల గాన్ని బ్యాగులు అందజేశాం
- ధాన్యం డబ్బులు 45 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త**
దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి తెలంగాణ రాష్ట్రంలో వచ్చిందని అనేక సవాల ల మధ్య ధాన్యం కొనుగోలు చేస్తున్నామని,పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.ఆదివారం ధాన్యం కొనుగోళ్లపై ఖమ్మం కలెక్టరేట్ నుంచి



2లో..

# ధాన్యం.. దైన్యం

- నెలల తరబడి కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు
- కల్లాల్లో పేరుకుపోతున్న ధాన్యం రాశులు
- పట్టించుకోని అధికారులు
- జిల్లా కలెక్టర్ చొరవ చూపాలంటున్న రైతులు

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:**
రైతుల రెక్కల కష్టం కల్లాలలోనే ములుగుతుంది.కల్లాల్లో ధాన్యం పోసి సుమారు 40 రోజులు కావస్తున్న కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. ఒక వైపు హమాలీల కొరత, మరో వైపు లారీలు రాక రైతులు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కంటా ప్రారంభమై నుండి ఇప్పటివరకు సగం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షం కురిస్తే పరిస్థితి ఏంటాని రైతులు అందోళన చెందుతున్నారు.

ఇలానే కొనుగోలు సాగితే మరో నెల రోజులు గడిచిన కొనుగోళ్లు పూర్తి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నత్తడకన కొనుగోళ్లమండలంలోని నిజామాబాద్, వట్టిమల్ల గ్రామాలలో ధాన్యం కొనుగోళ్ల

# సిండికేట్ గోల్ మాల్...!

## మొదటి పేజీ తరువాయి..

ఎజెండాగా టెండర్ ప్రక్రియ కూడా ముందుకు సాగింది.అయితే, టెండర్ల తదుపరి దశకు వెళ్లేలోపే కార్పొరేషన్‌లో సమీకరణాలు మారాయనే విమర్శలు లేకపోలేదు.కొత్త పాలకవర్గం కొలువుదీరడమే ఆలస్యం, అప్పటి పనులపై పునఃసమీక్ష పేరిట పాత టెండర్లను ఓపెన్ చేయకుండానే రద్దు చేసినట్లు ఆరోపణలు లేకపోలేదు.అయితే ఈ రద్దు వెనుక ఉన్న అసలు కారణాలను మాత్రం ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించకపోవడం గమనార్హం.

**87 పనులకు టెండర్లు:**

పాత పనులను పక్కనబెట్టిన యంత్రాంగం, ప్రస్తుత 2026 మే నెలలో అత్యంత వేగంగా 87 కొత్త పనులకు టెండర్లు పిలవడం కార్పొరేషన్ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈసారి పనుల విభజన, అంచనాల రూపకల్పనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఒకే పెద్ద పనిని చిన్న చిన్న పనులుగా విడగొట్టి, వేర్వేరు ప్యాకేజీలుగా మార్చడం వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు తెలుస్తోంది. టెండర్ ప్రక్రియలో కొంతమంది కాంట్రాక్టర్లు ముందుగానే ఒక అవగాహనకు వచ్చి సిండికేట్‌గా మారారనే ప్రచారం బలంగా సాగుతోంది.ఇతర కాంట్రాక్టర్లు పోటీ పడకుండా అడ్డుకుంటూ, ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లోనే ఈ రూ. 50 కోట్ల నిధులు తిరిగేలా తెరవెనుక చక్రం తిప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**లబ్ధిదారులు ఎవరు...?**

యుఐడిఎఫ్ నిధుల ప్రధాన ఉద్దేశం నగరంలో విలీనమై, కనీస వసతులకు నోచుకోని గ్రామాలను ఆదుకోవడం. కానీ ప్రస్తుత టెండర్లలో నగరంలోని పాత డివిజన్లకు సైతం పెద్ద పీట వేసినట్లు సమాచారం.ఇప్పటికే పలు విలీన గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయనేది అక్కడి కాలనీవాసుల వాదన.మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు, తాగునీటి ఇబ్బందులు తాండవిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో శివారు గ్రామాల పేరుతో తెచ్చిన నిధులను నగరమంతటా పంచిపెడితే అసలు లబ్ధిదారులు ఎవరవుతారు..విలీన గ్రామాల ప్రజలకు జరిగే న్యాయమేంటనీ స్థానికులు ప్రశ్నిస్తున్నారు..

**పారదర్శకత ఎక్కడ...?**

టెండర్ల రద్దు ప్రక్రియ మొదలుకొని కొత్త పనుల కేటాయింపుల వరకు జరిగిన మొత్తం వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని స్థానిక ప్రజలు,పౌర సమాజం డిమాండ్ చేస్తోంది.గతంలో ప్రతిపాదించిన పనులు ఎందుకు రద్దయ్యాయి..కొత్తగా ఏ ప్రమాణాల ఆధారంగా ఈ 87 పనులను ఎంపిక చేశారు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.మొత్తం రూ. 50 కోట్లలో విలీన గ్రామాలకు దక్కిన వాటా ఎంత.. పాత డివిజన్లకు మళ్లించిన నిధులెంత..ఈ ప్రశ్నలన్నింటికీ కరీంనగర్ నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు, పాలకవర్గం సమాధానం చెప్పి, నిధుల వినియోగంలో పారదర్శకత నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రంలో భారీ స్థాయిలో ధాన్యం దిగుబడి

## మొదటి పేజీ తరువాయి..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ పౌర సరఫరాల సంస్థ కార్యాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్సీ లు, మరియు ఎమ్మెల్యే లు,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూయాసంగి2026 ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా నిర్వహించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది దేశంలోనే భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 24గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా అర్బన్ డెవలప్మెంట్ ఆల్ ఇండియా లెవెల్ మీటింగ్లో పాల్గొన్నప్పుడు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వరి పొలాల్లో కొయ్యలు కాల్చడం పై విస్తృతంగా చర్చ జరిగిందని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు మరియు రైతులకు పంట పొలాల్లో కోతల అనంతరం కొయ్యలను కాల్చడంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లు పూర్తిస్థాయిలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ యాక్షన్ తీసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంట అవశేషాలను పొలాల్లో కాల్చకుండా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో టామ్‌టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవగాహన కార్యక్రమాల అనంతరం కూడా పంట అవశేషాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు.ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు 100 శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ తరపున అవసరమైన ఖర్చులను రీయింబర్స్‌మెంట్ చేస్తామని తెలిపారు.100 శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్‌టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాలకు రైతులు భయపడుతున్న నేపథ్యంలో మొత్తం వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు జిల్లా కలెక్టర్లు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు మరియు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. తప్పా, తాలు కారణాలతో మిల్లర్లు రైతులకు ఇబ్బంది గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు డాటా ఎంట్రీ చేసిన కొన్ని గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాలో జమవుతాయని అన్నారు.ఆదివారం కూడా రైతుల ఖాతాల్లో అవుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో 21 కోట్ల గన్నీలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని గన్నీల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కని విని ఎరుగని రీతిలో వరి ధాన్యం దిగుబడి రాష్ట్రంలో అయిందని ఇప్పటికే రైతుల ఖాతాల్లో 45 వేల కోట్ల రూపాయలు జమ అయ్యాయని తెలిపారు. రైతుల పక్షపాత ప్రభుత్వం రైతులకు మేలు చేసే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఈ సందర్భంగా అన్నారు. జిల్లాల్లో ఏదైనా సమస్యలు ఉంటే సివిల్ సప్లై కమిషనర్ తో నేరుగా మాట్లాడాలని, జిల్లా ఇన్చార్జి మంత్రులతో నేరుగా మాట్లాడి వారిని సమన్వయం చేసుకుంటూ సమస్యలను అధిగమించాలని అన్నారు. హమాలీ గోదాములు, రవాణా సమస్యలు ఉంటే సివిల్ సప్లై శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూరాష్ట్ర మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని, వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు...ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం అధికంగా దిగుబడి అయిందని గోదాముల సామర్థం నిండినట్లయితే రాజన్న సిరిసిల్ల చేనేత గోదాములు ఉపయోగించుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అన్నారు. జగిత్యాల జిల్లాలో జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు సమన్వయంతో రానున్న పది రోజులలో పూర్తిస్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేస్తామని ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తామని అన్నారు. జిల్లాలో లారీల కొరత, హమాలీల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం అధికంగా దిగబడి అయినందున గోదాముల సామర్థం నిండినట్లయితే రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తో మాట్లాడి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చేనేత గోదాములను ఉపయోగించుటకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం అధికంగా వచ్చినందున రైతులు సంతోషంగా ఉన్నారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. వచ్చే సీజన్ కు కూడా సంబంధిత అధికారులు ఇప్పటినుండే ఎలాంటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ మే నెల ఆఖరి వరకు వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేసే విధంగా యాక్షన్ ప్లాన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. అలాగే రోజువారి రిపోర్టులను ప్రభుత్వానికి అందించాలని వచ్చే వారం కొనుగోలు కేంద్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు కూడా విజయవంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్లను అభినందించారు. భారతదేశ చరిత్రలోనే వరి ధాన్యం ఎంత పెద్ద మొత్తంలో రావడం ఇదే మొదటి సారి అని అన్నారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి రబీ 2026 వరి ధాన్యం కొనుగోళ్ళను జిల్లా ఇన్చార్జి మంత్రులను మరియు ఉన్నతాధికారుల సమన్వయం తో విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు ...ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు ల ఆదేశాల మేరకు రానున్న పది రోజుల్లో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోళ్ళను పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాల్లో 441 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని 96 రైస్ మిల్లులకు తరలిస్తున్నామని జిల్లాలో 1.20 లక్షల గన్నీ లు అందుబాటులో ఉన్నాయని 3.80 లక్షల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిందని 2.93 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు పూర్తి చేశామని ఎందుకు సంబంధించిన 36626 రైతులకు వారి ఖాతాల్లోకి 498.90 కోట్ల రూపాయలు ఇప్పటివరకు జమ అయ్యాయని తెలిపారు. జిల్లాలో అమాలి కొరత గన్నీల కొరత లేదని అన్నారు అదేవిధంగా జిల్లాలో గోదాములు నిండినట్లు అయితే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని టి జి ఐ డి సి లను ఉపయోగించేందుకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, జిల్లా స్థాయి సంబంధిత అధికారులు, కలెక్టరేట్ ఏవో మరియు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం.. దైన్యం

## మొదటి పేజీ తరువాయి..

ప్రక్రియ పూర్తిగా నత్త నడకన సాగుతోంది. నిజామాబాద్ గ్రామంలో కేడీసీసీ అధ్వర్యంలో రెండుచోట్ల వరిధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో సుమారు 190మంది రైతులు వరిధాన్యం రాశులు పోయగా 20 నుండి 30మంది రైతుల ధాన్యం మాత్రమే కొనుగోళ్లు చేశారు. అలాగే మరో సెంటర్‌లో 170 మంది రైతులు ధాన్యం పోయగా 52 రైతు సీరియల్ నడుస్తుంది. ధాన్యం పోసి నెల 10 రోజులు కావస్తున్న ఇప్పటివరకు సగం మంది రైతుల ధాన్యం కొగనుళ్లు చేయలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు కేంద్రానికి వచ్చి పరిశీలించడమే తప్ప చేసేదేమి లేదని రైతులు చెపుతున్నారు. సెంటర్‌లో హమాలీల కొరత తీవ్రంగా ఉండడంతో పాటు లారీలు రాక రైతులే తమ ట్రాక్టర్లలో మిల్లులకు ధాన్యం తరలించే దుస్థితి నెలకొంది. మరో వారం గడిస్తే వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇక వట్టిమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. ఇక్కడ 180మందికి పైగా రైతులు వరిధాన్యాన్ని సెంటర్‌కు తరలించారు. లారీలు రాకపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా సాగడంలేదు. తూకం వేసిన బస్తాలు తరలిస్తేనే కాంటా వేయడంతో ధాన్యం కొనుగోళ్లలో తీవ్రజాప్యం నెలకొంది. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ చొరవ చూపి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వేగంగా తరలించే తగు చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# నిప్పుల కుంపటిగా మారిన జమ్మికుంట..

## మొదటి పేజీ తరువాయి..



46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వృద్ధులు, వయోస్సులో ఉన్నవారు అన్న తేడా లేకుండా పక్షుల్లా ఐదు ప్రాణాలు రాలిపోయాయి. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో పిన్‌రెడ్డి అశ్విని (25) సంవత్సరాల యువతి వడదెబ్బ తగిలి ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయింది. ఇది ఇలా ఉండగా జమ్మికుంట పట్టణంలో యాచక వృత్తి కొనసాగిస్తూ జీవించే 62సంవత్సరాల వృద్ధుడు ఎండ వేడిమి తట్టుకోలేక రైల్వే అండర్ బ్రిడ్జి మోరి వద్ద ప్రాణాలు వదిలాడు. అనాథగా చనిపోయిన యాచకున్ని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్‌లు పోలీస్ సిబ్బంది సహకారంతో మృత్యువాత పడ్డ వృద్ధున్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. జమ్మికుంట పట్టణంలో 11వార్డుకు చెందిన గుల్లి లింగయ్య వ్యవసాయ పనులకు ఆరుబయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై పిట్టపిల్లలా నేలరాలిపోయాడు. ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి గ్రామానికి చెందిన నేతకార్మికుడు కొడారి సారయ్య (70) నిత్యం కమలాపూర్ మండలంలోని మర్రిపల్లి గూడెంలోని చేనేత సంఘంలో మగ్గం పనిచేస్తూ సంఘంలో పనిచేసి ఇంటికి తిరిగి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురైన సారయ్య ఒక్కసారిగా నేలరాలిపోయాడు. హుజురాబాద్ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఏకుల రాజు (35) ట్రాక్టర్ పనికి ఆరుబయటకు వెళ్లి వడదెబ్బ తాకడంతో తీవ్ర అస్వస్థతకు గురైయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే రాజు మృత్యువాత పడ్డాడు. డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే రాజు మృత్యువాత పడడంతో ఆయన కుటుంబం రోడ్డున పడింది. జమ్మికుంట ప్రాంతంలో ఒకే రోజు ఐదుగురు మృత్యువాత పడడం ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాబ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు ఇండ్ల నుండి బయటకు రాకూడదని, తప్పనిసరి పరిస్థితి అయితే ఉదయం 6గంటల నుండి 10గంటల లోపే బయటకు వచ్చి ఇండ్లు చేరుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఆదివారం హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు, పశుపక్షాదులు ఆరుబయట కనిపించకుండా కనుమరుగైపోయారు.

# అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా పెద్దపల్లిని మార్చిన మాజీ ఎమ్మెల్యే దాసరి

స్కాములు త్వరలోనే బట్టబయలు చేస్తాం
మనోహర్ రెడ్డి ఇసుక, మట్టి దందాలపై కాంగ్రెస్ నిప్పులు
ఎమ్మెల్యే విజయరమణారావుపై
అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు
కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేష్ గౌడ్



పెద్దపల్లి, ప్రభాతవార్త:

గత పదేళ్ల బీ.ఆర్.ఎస్ హయాంలో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చేసిన ప్రతి ఒక్క స్కామును ఆధారాలతో సహా త్వరలోనే ప్రజల ముందు బట్టబయలు చేస్తామని పట్టణ అధ్యక్షులు భూషణవేణి సురేష్ గౌడ్, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు సయ్యద్ మస్రత్ హెచ్చరించారు. రైతులను నిలువునా దోచుకుని, ఇసుక, మట్టి దందాలతో కోట్ల రూపాయలు వెనకేసుకున్న బీ.ఆర్.ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని విమర్శించే నైతిక అర్హత లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్యపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య 6 సార్లు ప్రజా ప్రతినిధిగా గెలుపొంది పెద్దపల్లి ప్రజల గుండెల్లో చిరకాల ముద్ర వేసుకున్నారని, తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అంతేకాకుండా 36 వార్డుల్లో ఏ వార్డు నుంచి పోటీ చేసినా గెలుపొందే వ్యక్తిత్వం కలిగిన మాస్ లీడర్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టి, ఇసుక దందాలు చేసి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తన సొంత విద్యాసంస్థలకు మట్టిని తరలించుకుని, కోట్ల రూపాయలు దండుకున్నారని మండిపడ్డారు. రైతుల నుంచి వడ్ల కొనుగోళ్ల సమయంలో తరుగు పేరుతో రైతులు పండించిన పంటను పూర్తిగా దోపిడీ చేసి, మిల్లర్లతో కుమ్మక్కై కోట్ల రూపాయలు సంపాదించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హయాంలో ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేసి, కేవలం అక్రమ వ్యవహారాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికైనా వక్రబుద్ధి మానుకుని అభివృద్ధికి పాటుపడే నాయకుల పట్ల గౌరవం కలిగి ఉండాలని, లేనిపక్షంలో గతంలో చేసిన స్కాములన్నింటినీ ఆధారాలతో సహా త్వరలోనే ప్రజల ముందు బయట పెడతానని సయ్యద్ మస్రత్ హెచ్చరించారు. బీ.ఆర్.ఎస్ పాలనలో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు ఏమాత్రం నాణ్యత లేకుండా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా పాలనలో మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత కేవలం రెండు నెలల్లోనే దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులుచేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నిజమైన రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని, వడ్ల కొనుగోళ్లు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా సందర్శిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎక్కడా కటింగ్స్ లేకుండా పారదర్శకంగా ధాన్యపు కొనుగోళ్లు జరుగుతున్నాయని, మరో రెండు మూడు రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని వెల్లడించారు. దమ్మృంటే బీ.ఆర్.ఎస్ నాయకులు ప్రజల ముందుకు వచ్చి చర్చకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే విజయరమణారావుపై, కాంగ్రెస్ నాయకులపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు కూడా వాస్తవాలను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లు మొలుగూరి కమల్, కొమ్ము సుధాకర్, గుజ్జుల కుమార్, మంతని నర్సింగ్, దొడ్డుపల్లి జగదీష్, అస్లాం పర్వేజ్, జగదీష్, ఫణిందర్, నదీమ్, సుధమళ్ళ అమ్రేష్, పూరెల్ల సుధాకర్, అక్కెపల్లి క్రాంతి, ముఖ్య నాయకులు పూదరి మహేందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, తూముల సుభాష్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చార్ధామ్‌లో వేములవాడ వాసి మృతి



వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడ పట్టణానికి చెందిన ఆకుల నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం చార్ధామ్ యాత్రకు వెళ్లారు. శ్వాస అందక ఆదివారం ఉదయం ఆయన మృతి చెందారు. నరేష్ ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**మానకొండూర్, ప్రభాతవార్త :** మండలంలోని శ్రీనివాస్ నగర్ మానేరు వాగులో నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మానకొండూర్ సీఐ శ్రీలత ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ నగర్ మానేరు వాగులో నుండి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా మండల కేంద్రంలో పట్టుకు న్నట్లు తెలిపారు. పట్టుపడ్డ ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు వరి కొప్పుల తిరుపతి, వరి కొప్పుల సతీష్, వరి కొప్పుల మహేందర్ లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలోని మానేరు వాగులో నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ శ్రీలత కోరారు.



## ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది

-వ్యవసాయ బావిలో మునిగి యువకుడు మృతి

**ధర్మపురి, ప్రభాతవార్త:** స్నేహితులతో కలిసి ఈత కోసం వెళ్లిన యువకుడు వ్యవసాయ బావిలో మునిగి మరణించిన సంఘటన ధర్మపురి మున్సిపల్ పరిధిలోని కొరండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లింగం అక్షయ్ (24) అనే యువకుడు వేసవి సెలవుల కారణంతో కొరండ్లపల్లె లోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. సాయంత్రం వేళలో స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న ఓ వ్యవసాయ బావిలోకి ఈత కోసం వెళ్ళాడు. ఒడ్డు పైనుండి ఓ తాడును ఏర్పాటు చేసి అందరు కలిసి బావిలోకి దిగారు. బావి నుండి ఒడ్డు పైకి తాడు సాయంతో రావడానికి ప్రయత్నించగా అందులో మునిగాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు కాకపోవడంతో మృతి చెందాడు. యువకుడి మృతి పట్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.



## గంటల వ్యవధిలోనే భార్యాభర్తల మృతి

విషాదంలో కుటుంబ సభ్యులు

ధర్మపురి, ప్రభాతవార్త:



ఒకరికొకరు తోడుగా ఉంటూ జీవనం సాగిస్తున్న వృద్ధ దం పతులు కొన్ని గంటల వ్యవధిలోనే మరణించడంతో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగి పోయారు. వివరాలు ఇలా ఉన్నాయి ధర్మపురి మండలం దోనూరు గ్రామానికి చెందిన జంగం రాజయ్య, సాయమ్మ వృద్ధ దంపతులు కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం హఠాత్తుగా రాజయ్య మరణించాడు. కాగా కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న సాయమ్మ భర్త మరణం చూసి కృంగిపోయింది. భర్త మరణించిన గంటల వ్యవధిలోనే ఆమె సైతం మరణించింది. ఇరువురు ఒకే రోజు మరణించడంతో వారి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. రాజయ్య మృతదేహానికి శనివారం అంతక్రియలు జరపగా సాయమ్మకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. భార్య భర్తలు ఒకే రోజు మృతి చెందడంతో స్థానికులు సైతం తమ బాధను వ్యక్తం చేశారు.

## జగిత్యాల రూరల్ పోలీసుల తనిఖీ

1694 గ్రాముల గంజాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు

జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు చెల్గల్ గ్రామ శివారులో పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఈ అక్రమ రవాణా గుట్టు రట్టయింది. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తారకరామానగర్ గ్రామానికి చెందిన తాటిపాముల వంశీ, రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన మెండే అనిల్‌లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి 1694 గ్రాముల గంజాయిని, ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా సరఫరా చేసేందుకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి రవాణా లేదా విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని జగిత్యాల రూరల్ పోలీసులు ప్రజలను కోరారు.

# నేరాలు-దారుణాలు

## గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ బోయిని నరసయ్య గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత రెండు రోజుల క్రితం నరసయ్య అస్వస్థతకు గురై ఛాతిలో నొప్పిగా ఉంది అని తెలుపగా కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తుండగా ఆదివారం మధ్యాహ్నం తీవ్రమైన గుండెపోటు రావడంతో నరసయ్య మృతి చెందాడు మృతునికి భార్య ఉపేంద్ర తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## వడదెబ్బతో ఒకరు మృతి

కాల్వశ్రీరాంపూర్.. ప్రభాతవార్త:



మండల కేంద్రంలో వడదెబ్బకు గురి అయి ఒకరు మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన యాదగిరి కనుకయ్య 60 ఆదివారం పనిమీద బయటికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి వడదెబ్బ కు తన ఇంటిలో పడిపోయినాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య సాయమ్మ ఉన్నది. మృతుడు యాదగిరి కనకయ్య నిరుపేద కావడంతో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు తెలిపారు.

## పొగాకులపల్లిలో అగ్నిప్రమాదం

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

మండలంలోని మన్నెంపల్లి అనుబంధ పొగాకులపల్లి గ్రామంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో నిప్పులు చెలరేగడంతో గడ్డికట్టలు, పైపులు కాలి బూడిదయ్యాయి. దగ్గరలో ఉన్న ఇళ్లకు మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయభ్రాంతులయ్యారు. సమాచారం అందుకున్న సర్పంచ్ పొన్నం సునీత అనిల్‌గౌడ్ వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అందుబాటులో లేకపోవడంతో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను సమకూర్చుకుని స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బకెట్లు, పైపుల ద్వారా నీళ్లు చల్లి మంటలు ఆర్పేశారు. మంటలు ఆర్పినవారిలో ఉపసర్పంచ్ బూడిద కిశోర్, నిమ్మనగొట్టు అంజయ్య, బొంతల శ్రీనివాస్, కొలిపాక శ్యామ్, బూడిద సంపత్, జక్కుల అంజి, బూడిద రాజయ్య, సుదగోని పర్శరాములు, శ్రీనివాస్, పోతుగంటి సంపత్, సుదగోని శ్రావణ్, దరిపల్లి వేణుకుమార్, సుదగోని సదయ్య, కొలిపాక రాజమొళి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు చేనేత కార్మికుడు మృతి

కమలాపూర్: ప్రభాతవార్త.



లక్ష్మాజీపల్లికి చెందిన చేనేత కార్మికుడు కోడూరి సారయ్య (70) వడదెబ్బతో మృతి చెందాడు. కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామంలో చేనేత సంఘంలో మగ్గం పనిచేసే సారయ్య శుక్రవారం ఎండకు అస్వస్థతకు గురయ్యాడు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. 70 ఏళ్ల వయసులోనూ కుటుంబాన్ని పోషిస్తున్న సారయ్య మృతితో వికలాంగురాలైన భార్య దిక్కులేనిదైంది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేసవిలో కూలీలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## మల్యాలలో వడదెబ్బకు వృద్ధుడి మృతి

మల్యాల/ ప్రభాతవార్త



మండల కేంద్రానికి కి చెందిన దప్పు గంగయ్య ( 68) ఆదివారం వడదెబ్బతో మృతి చెందినట్లు స్థాని కుల ద్వారా తెలిసింది, గంగయ్య ఆది వారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో, వెంటనే ఆయన కుటుంబ సభ్యులు జగిత్యాల లో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, అప్పటికే విపరీతమైన శరీర ఉష్ణోగ్రతలతో అపస్మారక స్థితికి చేరిన గంగయ్య ఆస్పత్రి లోనే మృతి చెందినట్లు తెలిసింది, విపరీతమైన ఎండల మూలంగా వడదెబ్బ తగిలి మృతి చెందిన గంగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు,

# పంట వ్యర్థాల దహనంపై రైతులకు పోలీసుల హెచ్చరిచిన్న నిరక్ష్యం

## భారీ అగ్ని ప్రమాదాలకు కారణం

**మేడిపల్లి/భీమారం, ప్రభాతవార్త:**

చిన్న నిరక్ష ్యంతో భారీ అగ్ని ప్రమాదాలకు కారణం అవుతున్నాయని మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిపల్లి, భీమారం మండలాల రైతులు వర్షాకాలం సాగుకు ముందు పొలాల్లో మిగిలిన వరి కొయ్యలు, మొక్కజొన్న అవశేషాలను కాల్చే చర్యలను వెంటనే నిలిపివేయాలని సూచించారు. రైతులు చేసే చిన్న నిరక్ష ్యం పెద్ద అగ్ని ప్రమాదాలకు దారితీస్తోందని హెచ్చరించారు. ఇటీవల కాలంలో కొంతమంది రైతులు పంట అవశేషాలకు నిప్పంటించడం వల్ల మంటలు వేగంగా వ్యాపించి ఈత వనాలు, తాడి చెట్లు, మామిడి తోటలు, పామాయిల్ తోటలు, కరెంటు మోటార్లు కాలిపోయిన ఘటనలు



చోటుచేసు కుంటున్నాయని తెలిపారు. గ్రామాల శివార్లలో ఉన్న ఇండ్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరి గడ్డి, మొక్కజొన్న అవశేషాలను పశువుల మేతగా, కంపోస్ట్, సేంద్రియ ఎరువుల తయారీలో, బయోగ్యాస్ ఉత్పత్తిలో వినియోగించుకోవచ్చని సూచించారు. పంట అవశేషాలకు నిప్పంటించడం చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు కేసులు కూడా నమోదు చేయబడతాయని హెచ్చరించారు. రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ పొలాలను, గ్రామాలను, ప్రకృతిని కాపాడాలని కోరారు.

## దళిత రత్న గ్రహీతలకు ఘన సన్మానం

**కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణానికి చెందిన బైరి విజయ్ కుమార్ బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్, వనతడుపుల అంజయ్య కల్లూరు గ్రామ మాజీ సర్పంచ్ లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రధానం చేసిన"దళిత రత్న" అవార్డు పట్ల కోరుట్ల పట్టణ ప్రజలు, మేధావులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల సి. ప్రభాకర్ గ్రంథాలయ ఆవరణలో చెన్న విశ్వనాథం అధ్యక్షతన అభినందన సభ ఘనంగా నిర్వహించారు. సమాజంలో దళితుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల బైరి విజయ్ కుమార్, వనతడుపుల అంజయ్య చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఓటారికారి శ్రీనివాస్ సభలో పేర్కొన్నారు. సమాజ సేవలో వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షి ంచారు. దళిత సమాజ హక్కుల పరిరక్షణలో సామాజిక చైతన్య నిర్మాణంలో, న్యాయ పరిరక్షణలో వారు చేస్తున్న సేవలు యువతకు ఆదర్శమని సభలో మరిపెల్లి గంగాధర్ అడ్వకేట్ కొనియాడారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు అయిన బైరి విజయకుమార్, వనతడుపుల అంజయ్యను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చెన్న విశ్వనాథం, ఓటారికారి శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, బద్ది నర్సయ్య, అలాల సత్యనారాయణ,ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భాస్కర్ , బీసీ ఎస్సీ ఎస్టీ విద్యావంతుల వేదిక కన్వీనర్ మరిపెల్లి గంగాధర్ , తుల గంగవ్వ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు తుల రాజేందర్, కార్మిక నాయకులు సుతారి రాములు , పట్టణ ప్రముఖులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగుల రాంబాయి కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి

**కోరుట్ల, ప్రభాతవార్త :**

కోరుట్ల పట్టణ సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది గంగుల రాంగోపాల్ ఆయన సోదరులు గంగుల సత్యార్థ ప్రకాష్, రణధీర్ ల తల్లి గంగుల రాంబాయి శనివారం ఉదయం పరమపదించారు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జువ్వాడి నర్సింగరావు వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రైసొద్దిన్, నాయకులు తెడ్డు విజయ్, రమేష్, పాత్రికేయులు కటుకం గణేష్,కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు



## రజియోద్దీన్ కుటుంబాన్ని పరామర్శ, ఆర్థిక సాయం

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ రజియోద్దీన్ శనివారం మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రజియోద్దీన్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు రజియోద్దీన్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు ఈకార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మెట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రైసోద్దీన్, టిపిసిసి సెక్రటరీ బండ శంకర్, జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, కౌన్సిలర్ షానాజ్ సుల్తాన్, రిజ్వాన్, రహీం, తెడ్డు విజయ్, వాసీమ్, మాజీ కౌన్సిలర్ నయీామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహీం, రంజిత్, శంకర్, రఫీ, షీజ్జు, అస్లాం, సోహిల్, ఎన్నారై సెల్ చంద్, బాధిత కుటుంబ సభ్యులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**కోరుట్ల, ప్రభాతవార్త :**

కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో కేక్ కట్ కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహేష్ కుమార్ గౌడ్ పిసిసి బాధ్యతలు చేపట్టాక అన్ని స్థాయిలో ఉన్న నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ కార్పొరేషన్ మునిసిపల్ సర్పంచ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిందని అన్నారు. రానున్న మండల పరిషత్ జిల్లా పరిషత్ఎన్నికలతో పాటు రానున్న శాసనసభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు చెందిన నేత మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం సమన్వయంతో తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల ప్రభాకర్, చెట్పల్లి రంజిత్ గుప్తా, నజ్జు, కాంగ్రెస్ పార్టీ పలు హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు






## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు నిరసనగా నేడు రాస్తారోకో

**కోరుట్ల అర్బన్ , ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ల ధరలు విపరీతంగా పెంచిన నేపథ్యంలో సామాన్యుడికి ఈ ధరలు పెనుబారంగా సంభవించాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుజువ్వడి కృష్ణారావు అన్నారు. దీనికి నిరసనగా నేడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుండి తహసిల్ చౌరస్తా వరకు ఉదయం తొమ్మిది గంటలకు రాస్తారోకో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసనకు కోరుట్ల నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 గంటలకు కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్ కు పార్టీ శ్రేణులు రావలసిందిగా కృష్ణారావు విజ్ఞప్తి చేశారు

## రైతుల కోసం రంగంలోకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర,ప్రభాత వార్త:**



గంగాధర మండలం మధురానగర్ వద్ద కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై లారీలను ఆపి ధాన్యం మిల్లులకు తరలించడానికి సహకరించాలని లారీ యజమానులను కోరిన ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన హామీని మర్చిపోకుండా కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు కేంద్రాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం లారీల కొరతతో మిల్లులకు తరలించడం ఇబ్బందిగా మారింది. రైతుల ఇబ్బందులను గ్రహించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై వెళుతున్న లారీలను మంగపేట చెక్పోస్ట్ వద్ద ఎమ్మెల్యే ఆపారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలింపుకు సహకరించాలని లారీల యజమానులతో మాట్లాడారు. అంతేకాకుండా ఎమ్మెల్యే లారీలో కూర్చుని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లారు. లారీ లోడింగ్ తర్వాత మిల్లులకు తరలించిన వెంటనే అన్లోడ్ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే లక్ష ్యంగా నిత్యం చొప్పదండి నియోజకవర్గం లోని కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి పర్యవేక్షి స్తూ రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తొలగిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**తరుగు పేరిట కోతలు విధిస్తే చర్యలు**

**మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: మే 24, ప్రభాతవార్త:**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల వారీగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట స్థానిక హమాలీలను నియమించుకోవాలని, రవాణా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్లు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తాలు, తరుగు పేరిట రైతుల ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. 'మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేసి, రోజువారీ లక్ష్యాలను సాధించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ప్రతిరోజూ కార్యక్రమాలను మహిళలు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి కృ, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

**-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: మే 24, ప్రభాతవార్త :**




రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్డూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశిత మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 8575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని, 8749 కోట్ల రూపాయల నగదు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. మసాంతంలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము, జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి




మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులు వెంటనే చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని, ప్రతిరోజు వరి ధాన్యం ప్రక్రియ పురోగతిపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సీఎంఆర్ ప్రక్రియ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

**సారంగాపూర్ ప్రభాతవార్త:** మండలంలోని రేచపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2026 పదవ తరగతి బ్యాచ్ లకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయ బృంద కలిసి ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ అప్పటి పాత జ్ఞాపకాలు పంచుకుంటూ సిల్వర్ జూబ్లీ వేడుక అందరినీ ఒక్క దగ్గరికి చేర్చి పండుగ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మధ్యాహ్నం సహపంక్తి విందు భోజనాలతో రోజంతా కోలాహ లంగా గడిచిందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యాప కులు శ్యామ్ సుందర్, దండే శ్రీనివాస్, కాంతయ్య, శ్రీనివాస్, శ్రీదీప్, తదితరులు పాల్గొన్నారు








## బొగ్గు గని కుటుంబాలకు కేంద్రం ఊరట

**-పాత పెన్షన్‌దారులకు కనీసం రూ.1,000..**

**-రెండేళ్ల బకాయిల చెల్లింపు**

**గోదావరిఖని ,ప్రభాతవార్త:**




బొగ్గు గనుల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం కీలక ఊరట కల్పించింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న కనీస ఫ్యామిలీ పెన్షన్ పెంపు డిమాండ్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలకు ఉపశమనం లభించనుంది. 'కోల్ మైన్స్ ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్1971' పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఇకపై కనీస ఫ్యామిలీ పెన్షన్‌ను రూ.1,000గా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం 'బొగ్గు గని పెన్షన్ (సవరణ) పథకం2026' నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరణను 2024 మార్చి 8 నుంచే అమల్లోకి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రస్తుతం జీవిస్తున్న పెన్షన్‌దారులకు మాత్రమే కాకుండా, గత రెండేళ్లకు సంబంధించిన బకాయిలు కూడా అందనున్నాయి. సుమారు 24 నెలల కాలానికి సంబంధించిన పెన్షన్ తేడా మొత్తాన్ని ఒకేసారి చెల్లించే అవకాశం ఉండటంతో వృద్ధులు, విధవరాలు, ఆధారిత కుటుంబ సభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### 16 వేల కుటుంబాలకు లాభం

దేశవ్యాప్తంగా సుమారు 16 వేల మంది పాత ఫ్యామిలీ పెన్షన్ లబ్ధిదారులకు ఈ నిర్ణయం నేరుగా ప్రయోజనం చేకూర్చనుంది. ముఖ్యంగా బొగ్గు గని ప్రాంతాలైన తెలంగాణ, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వేలాది కుటుంబాలు ఈ నిర్ణయంతో లబ్ధి పొందనున్నాయి. సింగరేణి ప్రాంతాల్లో కూడా అనేక మంది పాత పెన్షన్‌దారులు చాలా తక్కువ మొత్తాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, జీవన వ్యయాల మధ్య నెలకు వచ్చే స్వల్ప పెన్షన్‌తో జీవనం సాగించడం కష్టంగా మారింది. ఇప్పుడు కనీస పెన్షన్ రూ.1,000కు పెరగడంతో కొంతమేర ఉపశమనం దక్కనుంది. సింగరేణి ప్రాంతాల్లో కూడా అనేక మంది పాత పెన్షన్‌దారులు చాలా తక్కువ మొత్తాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, జీవన వ్యయాల మధ్య నెలకు వచ్చే స్వల్ప పెన్షన్‌తో జీవనం సాగించడం కష్టంగా మారింది. ఇప్పుడు కనీస పెన్షన్ రూ.1,000కు పెరగడంతో కొంతమేర ఉపశమనం దక్కనుంది.

### పాత స్కీమ్ వారికి అన్యాయం

బొగ్గు గని కార్మికులకు సంబంధించి 1971లో అమలులోకి వచ్చిన కుటుంబ పెన్షన్ పథకం కింద ఉన్న లబ్ధిదారులకు చాలా కాలంగా వివక్షకు గురయ్యారనే విమర్శలు ఉన్నాయి. తరువాత వచ్చిన 1998 పెన్షన్ స్కీమ్ పరిధిలోని వారికి ఇప్పటికే కనీస పెన్షన్ రూ.1,000 అమలులో ఉంది. అయితే పాత 1971 స్కీమ్ పరిధిలో ఉన్న వేలాది మంది మాత్రం చాలా తక్కువ పెన్షన్‌తోనే కొనసాగుతున్నారు. దీంతో కార్మిక సంఘాలు, పెన్షనర్ల సంఘాలు పలుమార్లు కేంద్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లాయి. కనీస జీవన భద్రత దృష్ట్యా పాత పెన్షన్‌దారులకు కూడా సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశాయి. చివరకు కేంద్ర ప్రభుత్వం సవరణ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆ డిమాండ్ నెరవేరినట్లైంది.

### కార్మిక సంఘాల హర్షం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బొగ్గు గని కార్మిక సంఘాలు స్వాగతించాయి. దీర్ఘకాలంగా పోరాడిన ఫలితమే ఈ నిర్ణయమని సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా విధవరాలు, వృద్ధులు, ఆధారిత కుటుంబాలకు ఈ పెంపు కొంత ఆర్థిక భరోసా కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. పెన్షన్ పెంపుతో పాటు బకాయిల చెల్లింపు నిర్ణయం కూడా లబ్ధిదారులకు మరింత ఉపశమనాన్ని ఇవ్వనుందని చెబుతున్నారు. చాలామంది పెన్షన్‌దారులు వైద్య ఖర్చులు, అప్పులు, నిత్యావసరాల భారంతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ మొత్తం వారికి ఉపయోగపడనుంది.

### సామాజిక భద్రతకు బలంపాటు

బొగ్గు గని కార్మికులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తూ దేశ పారిశ్రామిక అభివృద్ధికి కీలక పాత్ర పోషించారు. అలాంటి కార్మికుల కుటుంబాలకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతేనని కార్మిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా నిర్ణయం ద్వారా పాత పెన్షన్‌దారుల సమస్యపై కేంద్రం స్పందించడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో మరింత పెంపు అవసరమని పెన్షనర్లు కోరుతున్నారు. ఏళ్ల తరబడి నిరీక్షించిన తర్వాత కనీస పెన్షన్ పెంపు అమల్లోకి రావడంతో బొగ్గు గని ప్రాంతాల్లో ఆనంద వాతావరణం నెలకొంది. కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది వృద్ధులకు ఈ నిర్ణయం కొత్త ఆశలను నింపింది.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి





## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త,మే 24:** జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్య వర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించ బోమన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించ వలసి ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి హాజ రయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధి కారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడ దన్నారు. మహిళా సంక్షేమ వారోత్స వాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్య క్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొ న్నారు. ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లయ్ కృష్ణవేణి, డి డబ్ల్యూ ఓ ప్రేమ లత, సి పి ఓ ప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పసరలో విద్యుత్ శాఖ కీలక సూచన

### కరెంటు వచ్చాక 30 నిమిషాలు,ఆగి ఏసి ఆన్ చేయండి

### పసర లైన్ ఇన్స్పెక్టర్ దండు రామచంద్రయ్య



**గోవిందరావుపేట ప్రభాతవార్త** పసర గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్‌తో కాలిపోకుండా ఉండాలంటే ప్రజలు సహకరించాలని పసర విద్యుత్ కేంద్రం లైన్ ఇన్స్పెక్టర్ దండు రామచంద్రయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం పత్రికా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ తగ్గించేందుకు వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

లైన్ ఇన్స్పెక్టర్ సూచనలు,పవర్ కట్ అయినా సమయంలో ఏసి స్విచ్ ఆఫ్ లో చేయాలని,కరెంటు పునరుద్ధరించిన వెంటనే ఏసి ఆన్ చేయవద్దని అన్నారు.కరెంటు వచ్చాక కనీసం 30 నిమిషాలు ఆగి ఏసి ఆన్ చేసుకోవాలని అన్నారు.ఎందుకు 30 నిమిషాలు!!! “కరెంటు రాగానే అందరూ ఒకేసారి ఏసీలు , ఫ్రిజ్‌లు ఆన్ చేస్తే గ్రిడ్, ట్రాన్స్‌ఫార్మర్‌పై ఒక్కసారిగా లోడ్ పడు తుందని, దీనివల్ల లో వోల్టేజ్ వచ్చి పరికరాలు కాలిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ట్రాన్స్ ఫార్మర్ కాలిపోతే రాత్రంతా గ్రామానికి కరెంటు ఉండదు. కావున 30 నిమిషాలు ఆగితే లైన్ స్థిరపడుతుంది, లోడ్ బ్యాలెన్స్ అవుతుంది“ అని రామ చంద్రయ్య వివరించారు. అలాగే అవసరం లేని చోట లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలని, విద్యుత్ సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా సేవలందిస్తున్నారని, ప్రజలు కొంచెం ఓపిక పడితే అంతరాయం లేని విద్యుత్ అందుతుందని ఆయన తెలిపారు. ఎవరైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే స్థానిక లైన్‌మెన్‌కు లేదా పసర విద్యుత్ కేంద్రానికి తెలియజేయాలని సూచించారు.

## పార్థివదేహానికి పూల మాలవేసి నివాళులర్పించిన రాజారపు స్వామి

**కాజీపేట్ మండల్ మే24(ప్రభాతవార్త)**

కాజీపేట మండలం 64వ డివిజన్ టేకులగూడెం గ్రామానికి చెందిన మాచర్ల శ్రీకాంత్ వడదెబ్బతో మరణించినారు వారి పార్థివదేహానికి పూల మాలవేసి నివాళులర్పించిన 44వ డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్, రాజారపు.స్వామి కడిపికొండ ఇందిరమ్మ కాలనీ గ్రామ అధ్యక్షుడు సిలువేరు.కరుణాకర్ మాదాసు.సునీల్,జన్ను.అజయ్, తదితరులు పాల్గొన్నారు.



# మెట్‌పల్లి వార్త

## ఘనంగా మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :**



టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ఆదేశాల మేరకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మెట్‌పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ కాంగ్రెస్ నేతలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర స్థాయిలో బలోపేతానికి మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని కొనియాడారు. పార్టీ కార్యకర్తలకు ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మార్గనిర్దేశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిషెర్మన్ ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్బుదిన్ పాషా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అమ్ముల పవన్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, మొగిలి రాజేందర్, బైండ్ల శ్రీకాంత్, ముద్దం ప్రశాంత్, కోరే రాజ్ కుమార్, షాజెబ్, ఫయుజ్ ఫర్హాన్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జువ్వాడి ఆధ్వర్యంలో మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**. మెట్‌పల్లి,ప్రభాతవార్త:**



పట్టణంలోని జువ్వాడి భవన్ లో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యంలో టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం కేక్ కట్ చేసి, ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ..టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగ మారిందని,మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుండి జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించ్చిదని పేర్కొన్నారు.రాబోవు రోజుల్లో కూడా మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిషత్,మండల పరిషత్ ఎన్నికల్లో అధ్యధిక స్థానాలు గెలుపొందుత్నా అని జువ్వాడి నర్సింగ రావు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు ఎండి రైసొద్దీన్,రాజేందర్, మున్సిపల్ వైస్ చేర్మెన్ ఓంకారి నవీన్,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్,నాయకులు నేరెళ్ల దేవేందర్,ద్యావనపల్లి రాజారామ్,ఎమ్ ఏ ముఖీమ్,పల్లి శేఖర్ గౌడ్,బావు శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో జీలుగా విత్తనాలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని రైతన్నలకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి ప్రవీణ్ ఆదివారం తెలిపారు.ఇల్లంతకుంట మరియు పెద్ద లింగాపూర్ ప్యాక్స్ లో అందుబాటులో ఉన్నాయన్నారు.జీలుగ 30 కేజీల బ్యాగు ధర సబ్సిడీ పోను 2 వేల 452 రూపాయలకు లభిస్తుందని సూచించారు.కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్ కార్డు,ఫోన్ నంబర్ తో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నేటి నుండి సంప్రదించాలని కోరారు.30 కేజీ ల సంచి రెండున్నర నుండి 3 ఎకరాల వరకు విత్తుకోవచ్చని ప్రవీణ్ తెలిపారు.

## పాలిటెక్నిక్ టి జి ఆర్ జె సి పరీక్షలలో జ్ఞాన దీప్ విద్యార్థుల ప్రభంజనం..

ఎల్లారెడ్డిపేట మే 24,ప్రభాత వార్త





ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామములోని జ్ఞాన దీప్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ రోజు శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించారాని పాఠశాల కరెస్పాండంట్ మిట్టపల్లి లక్ష్మి నారాయణ తెలిపారు. చల్ల శ్రీవర్ధన్ రెడ్డి టి జి ఆర్ జె సి పరీక్షలో స్టేట్ 246 ర్యాంక్ సాధించగా పాలిటెక్నిక్ పరీక్షలో 6467 ర్యాంక్, ముత్యాల శ్రీకరి 2697, శ్రీరాముల అశ్విత్ 5461ర్యాంక్ సాధించారు. ఒలింపియాడ్, ఐ ఐ టి తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు ఈ సందర్బంగా కరెస్పాండంట్ లక్ష్మి నారాయణ విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని. తల్లిదండ్రులను అభినందించారు.

## జిల్లా విజిలెన్స్ అధికారికి సన్మానం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మండలంలో గతంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వర్తించిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్బంగా ఆదివారం వల్లంపట్ల గ్రామములో పలువురు నాయకులు శాలువాతో సత్కరించారు.ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్,సిడిపివో నాయిని ఎల్లయ్య,నాయకులు గజ్జెల రాజశేఖర్ గౌడ్,మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్,కట్ట నర్సింహా రెడ్డి,నాయిని ధర్మయ్య, నాయిని రమేష్,వీరయ్య,రాజేశం,నేరెళ్ల శ్రీనివాస్,పులి మల్లేశం,కీసరి రవి,నేరెళ్ల రాజు కాసారపు పర్శరాములు,నాయిని నర్సయ్య, మహేందర్,మధు పాల్గొన్నారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ 55వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని గౌడ కులస్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి మంగళహారతులు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ముందుగా వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పురోహితులు సంకెపల్లి సుధాకర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున గౌడ కులస్తులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు

## సిపిఎం పార్టీ సిరిసిల్ల పట్టణ కార్యదర్శిగా ఎలిగేటి రాజశేఖర్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శిగా ఎలిగేటి రాజశేఖర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణ కమిటీ సమావేశం సత్యం అధ్యక్షతన నిర్వహించారు. పట్టణ కార్యదర్శిగా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కార్యదర్శి ము శం రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన పట్టణ కార్యదర్శి పట్టణంలో ప్రజా సమస్యలపై పోరాడాలని. పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు .ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు అన్నల్ దాస్ గణేష్. సురం పద్మ. మిట్టపల్లి రాజమల్లుగాక. జిందం కమలాకర్. రమేష్. తదితరులు పాల్గొన్నారు

## టి ఆర్ పి సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు.ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు మొగిళ్ల బాబు జిల్లా అధ్యక్షులు దండు వినోద్ ద్వారా సభ్యత్వం పొందారు.ఇల్లంతకుంట మండలంలో విస్తృతంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా అధ్యక్షులు సూచించారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ విధి విధానాలను జనాల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు.

## షార్ట్ సర్క్యూట్ తో పశుగ్రాసం దగ్ధం

గంభీరావుపేట, ప్రభాతవార్త:



షార్ట్ సర్క్యూట్ తో గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామ పరిధిలో 11 కె.వి విద్యుత్తు వైర్లు కిందికి వేలాడుతుండి ఈదురు ఈదురు గాలులకు మంటలు చెలరేగి అక్కడున్న పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. పశుగ్రాసం తో పాటు బోరు మోటర్లు, మోటార్ కు సంబంధించిన వైర్లు పైపులు దగ్ధమైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశుగ్రాసం దగ్ధాన్ని నిరసిస్తూ రైతులు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా రాస్తారోకో నిర్వహించారు. పంట పొలాల వద్ద విద్యుత్ వైర్ల వేలాడుతుండడంతో ప్రమాదము పొంచి ఉందని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. తక్షణం నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## ఘనంగా పీసీసీ జన్మదిన వేడుకలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



తెలంగాణ ప్రదేశ్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 60 వ జన్మదిన వేడుకలు ఆదివారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలు మరియు దళిత గిరిజన మైనారిటీ వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు మల్యాల రాజ్ వీర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు గుర్రం రాజా గౌడ్, నాయకులు ఎడబోయిన ప్రభాకర్, హజం, మేడ భాస్కర్, గరిగంటి నరసింహులు, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంగ్లా రాజు గౌడ్, దేశేటి రాజశేఖర్, శనిగరపు నరేష్ వర్మ, లక్కము నాంపల్లి, వేషాల వెంకటి, లక్కం బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వార్త



## గూడెంలో చేయూత స్వచ్ఛంధ సంస్థ ప్రారంభం



ముస్తాబాద్ ప్రభాత వార్త:

సమాజ సేవయే పరమావదిగా సమాజములో వెనుకబడిన వర్గాలవారు ఆపదలో వుండి ఆర్థికంగా లేక ఇబ్బంది పడుతున్నా వారీ కోసం ఆర్థిక సాయం అందించాలనే నేపముతో చేయూత స్వచ్ఛంధ సంస్థను గూడెం గ్రామములో గ్రామ సర్పంచ్ తాటిపెల్లి శంకర్ చేతుల మీదుగా ఆదివారం చేయూత స్వచ్ఛంధ సంస్థ పోస్టర్ ను ఆవిష్కరించారు.చేయూత స్వచ్ఛంధ సంస్థకు విక్కుర్తి లక్ష్మినారాయణ 5వేల రూపాయలను అందించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొప్ప ఆలోచనతో సేవా భావంతో పెద ప్రజల అభ్యున్నతి కోసం ఆకలితో వున్నావారికి పట్టెడు అన్నం పెట్టాలనే,లక్ష్యంతో పచ్చదనం పర్యావరణ కోసం విద్య అభివృద్ధి కోసం మీలో ఒకరై మేము అందరం మీ ముందుకు వస్తున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమములో సంస్థ అధినేత ఈదురాల సురేష్,బి పర్షరాములు,రవి,రాజయ్య,లక్ష్మణ్,బాధ నరేష్,ఉరడి రాజు,సత్యం, పకాల శ్రీకాంత్,మడిగే ప్రవీణ్,పెద్దూరి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు

## టి పీ సీ సీ అధ్యక్షుని జన్మదిన వేడుకలు



ఇల్లంతకుంట, ప్రభాతవార్త

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మండల నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రములోని బస్ స్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు,నాయకులు ఎలగందల ప్రసాద్, ఐరెడ్డి మహేందర్ రెడ్డి,ఎలుక రామస్వామి,పార్టీ మహిళా అధ్యక్షురాలు తీగల పుష్పలత,మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య,మామిడి సంజీవ్,రేగుల కార్తీక్,అంతటి శ్రీకాంత్ గౌడ్,సుధగోని సత్యనారాయణ,శ్రీనివాస్,ఎండి ఉస్మాన్,ఒగ్గు మధు,యాస నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ జన్మదిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురా దేవరాజ్, ఆకునూరి బాలరాజు, స్వరూప, వెంకటరమణ, కాముని వనిత నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అగ్ని ప్రమాదాల నివారణకు రైతుల అప్రమత్తత అవసరం

## -జగిత్యాల రూరల్ పోలీసుల సూచనలు

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**

జగిత్యాల మండలం రూరల్ పలు గ్రామాల్లో రైతులు పొలాల్లో వరి కొయ్యలు,గడ్డిని తగలబెడుతున్న ఘటనల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.ఈ నిరక్ష్య చర్యల వల్ల కేవలం వారి పంటలకే కాకుండా, పక్క పొలాల్లోని పంటలు,కరెంటు మోటార్లు, పైపులు కూడా దగ్ధమవుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.అంతేకాకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యం,గోనె సంచులకు కూడా మంటలు అంటుకుని భారీ ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.ఇవే కాకుండా,వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల నేలలోని పోషకాలు నశించి భూసారం దెబ్బతినడమే కాకుండా,వెలువడే దట్టమైన పొగతో పర్యావరణం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జగిత్యాల రూరల్ పోలీసులు రైతులకు,గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున, చిన్నపాటి నిరక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.పొలాల వద్ద గడ్డిని,వరి కొయ్యలను తగలబెట్టడం పూర్తిగా మానుకోవాలని,బీడీలు,సిగరెట్లు తాగిన తర్వాత వెలిగిన ముక్కలను పొలాల్లో వేయకూడదని సూచించారు.ఐకేపీ కేంద్రాలు,ధాన్యం నిల్వ ప్రాంతాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని,పొలాల వద్ద నీటి డ్రమ్ములు,ఇసుక సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని,గ్రామస్తులు,రైతులు పరస్పరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తూ,ఇతరులకు నష్టం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.రైతులు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో జాతీయ సోదరుల దినోత్సవం

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ సోదరుల దినోత్స వంను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం లోని అసోసియేషన్ కా ర్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు తమ అన్నదమ్ములను కానుకలతో సన్మానించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో సవాళ్ళను ఎదుర్కొంటున్నప్పుడు, అన్నదమ్ముల సాన్నిధ్యం మనకు సాటిలేని స్థిరత్వాన్ని, మద్దతును, తోడును అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కే. కృష్ణా రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వ నాథము, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు ఎం. డి. యా కూబ్, వివిధ సంఘాల



ప్రతినిధులు పుప్పాల నర్సింగారావు, పుప్పాల కిషోర్ కుమార్,సింగం గంగాధర్, కండ్లె గంగాధర్, సింగం భాస్కర్, కే. సత్యనారాయణ, పబ్బా శివానందం, వొజ్జల బుచ్చి రెడ్డి, బి. రాజేశ్వర్,గంగము జలజ, సింగం పద్మ, బక్కశెట్టి లక్ష్మి, బొబ్బటి కరుణ,తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే చక్కటి జీవితం

## -జత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**



చదువుతోనే సమాజంలో గుర్తింపు, చక్కటి జీవితం లభిస్తుందని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ అన్నారు పట్టణంలోని ఎల్ ఎల్ గార్డెన్స్ లో జరిగిన గౌడ ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ (గోప) జగిత్యాల జిల్లా కమిటీ నిర్వహించిన ప్రతిభ పురస్కారాల అవార్డ్స్ మహోత్స వంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్య, సౌకర్యాలు అందిస్తుందన్నారు. మంచిగా చదువుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని సూచించారు కుల పెద్దలు తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు ఉన్నత చదువులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం పలు సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.గౌడ పేద విద్యార్థులకు గోప అండగా అండగా ఉంటుందని గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్ తెలిపారు . గౌడ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలనే సంకల్పంతో ప్రతిభా పురస్కార ప్రధాన మహోత్స వం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చదువు ఒక్కటే ఆత్మవిశ్వాసం పెంచుతుందన్నారు. ప్రపంచంలో నిలబెడుతుందన్నారు. విద్యార్థుల్లో



ఆత్మవిశ్వాసం, ప్రేరణ కలిగించారు ఇష్టపడి చదవాలని చదువుతూనే భవిత ఉందని చెప్పారు తల వంచి పుస్తకం చదివితే తల ఎత్తుకునేలా చేస్తుందని చదువు విలువను చాటారు పట్టుదలతో సబ్జెక్టు నైపుణ్యాలు అన్ని భాషలపై పట్టు సాధించాలి పట్టు సాధిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని విజేతలుగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గోల్కొండ రాజు వారసులమని ఆయన స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో విద్యార్థులు చక్కగా చదువుకోవాలని చెప్పారు ఒక ఆడపిల్ల ఇంట చదివితే ఆ ఇంటికి వెలుగు వస్తుందని ఆ కుటుంబమే ఎదుగుతుందని అన్నారు చదువుకునే పేద పిల్లలకు గోపా తోడుండి ఆర్థికంగా ఆదుకుంటుందని చదువు ఎవరు ఆపవద్దని ఉన్నత చదువులు తప్పకుండా చదవాలని వక్తలు ఆకాంక్షించారు. అనంతరం పదవ తరగతి ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్స రంలో 90 శాతం మార్కులు పైగా సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి 5000 వేల నగదు బహుమతి ప్రోత్సా హకంగా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గోపా కమిటీ జగిత్యాల జిల్లా కమిటీ తో పాటు కోరుట్ల మెట్పల్లి రాయికల్ మల్యాల పెగడపల్లి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు గోప సభలో ప్రవీణ్ కళా బృందం పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# మాజీ మంత్రి రాజేష్ గౌడ్‌ను పరామర్శించిన పోలీసు అధికారులు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

హైదరాబాద్‌మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్ ని జగిత్యాల జిల్లా మల్యాల మండల్ వాస్తవ్యులు. రాజేశం గౌడ్ బంధువులు లక్ష్మిబాయ్ మరదలు ఇంద్ర గౌడ్ వారి కో బ్రదర్ విశిష్ట సేవల గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నా సబ్ ఇన్‌స్పెక్టర్ బుర్ర ఎల్లయ్య గౌడ్. సంధ్యారాణి దంపతులు వారి కుమారుడు సాయి గౌడ్ ఆత్మీయంగా కలిసి పరామర్శించారు.మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న గోడిశెల రాజేశం గౌడ్ ని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షి ంచారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు.





# జగిత్యాల వార్త

# ముగిసిన విష్ణు పురాణ ప్రవచనాలు

## వైభవంగా శ్రీ లక్ష్మీనారాయణుల శాంతి కళ్యాణం

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త:**



కృష్ణా నగర్ లోని ఉమా శంకర్ గార్డెన్స్ లో గత వారం రోజులుగా ప్రముఖ పౌరాణిక వేద పండితులు ..బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ.. గారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ మహా విష్ణు పురాణ ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ప్రవచనాల ముగింపు సందర్భంగా ఆలయంలో ..శ్రీ లక్ష్మీనారాయణుల శాంతి కళ్యాణాన్ని.. అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలో ప్రముఖ పౌరాణిక, జ్యోతిష పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌసిక అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం పురాణ ప్రవచకులు బుర్రా భాస్కర శర్మ దంపతులకు భక్తులు దంపతి పూజ చేశారు. వ్యాసపీఠ ఉద్వాసన, కలశ ఉద్వాసన, కుంభ సంప్రోక్షణ, మహాదాశీర్వచనం కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నిర్వాహకులు ఊటూరి అశోక్ బాబు రమ దంపతులను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు.

### సత్యసాయి భక్తులకు సన్మానం

వారం రోజుల పాటు భక్తులకు అల్పాహారం, భోజన ప్యాకెట్ల ప్యాకింగ్, అన్నప్రసాద వితరణలో బట్టు రాజేందర్ ఆధ్వర్యంలో అద్భుతమైన సేవలు అందించిన శ్రీ సత్యసాయి భక్తులను బూర్రా భాస్కర శర్మ గారు ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో అర్చకులు చిన్ను స్వామి (నంబి నృసింహాచార్యులు), శ్రీరంగ వైభవ్, నిర్వాహకులు ఊటూరి ఓంకార్ నవత దంపతులు, సామాజిక కార్యకర్త రాంచంద్రం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తుంగూరులో సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ

**బీర్ పూర్ ప్రభాత వార్త**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపత్రి జీవన్ రెడ్డి ప్రత్యేక కృషితో మొత్తం 1,33,000 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల ను లబ్ధిదారులకు అందజేశారు. జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆ నిధులను క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడిసె జితేందర్ యాదవ్ తుంగూర్ గ్రామంలో లబ్ధిదారులందరినీ ఒకే చోట ఆత్మీయంగా కలుసుకుని, వారిని పరామర్శిస్తూ ఈ చెక్కులను అందజేశారు.ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు చుంచు ప్రమీలకు36 వేలు,, కందుకూరి చంద్రవ్వ కు 34వేలు ,పల్లపు లచ్చన్న 27,500 రూపాయలు పల్లపు నర్సవ్వకు .20,500 రూపాయలు మరియు పకాల మోనికకు 15,000 రూపాయల చొప్పున అందిన చెక్కులను చూసి ఆయా కుటుంబాలు ఎనలేని ఆనందం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పెద్ద దిక్కుగా నిలిచి సహాయం పొందడానికి కృషిచేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జితేందర్ యాదవ్ కి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్థోస్కోపీ వైద్య సదస్సు విజయవంతం

**కరీంనగర్ టౌన్,(ప్రభాతవార్త):**

ప్రముఖ ఆర్థోపెడిక్ ఆర్థోస్కోపిక్ కీ హోల్ శస్త్రచికిత్సల ప్రదర్శన, వైద్య సదస్సు విజయవంతంగా ముగిసింది. ఇండియన్ ఆర్థోస్కోపిక్ సొసైటీ జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ ఆర్థోస్కోపిక్ సొసైటీ, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, కరీంనగర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని రేనే హాస్పిటల్ ఈ అత్యాధునిక శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారానికి (లైవ్ టెలికాస్ట్) వేదికగా నిలిచింది.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్స నిపుణులు రేనే హాస్పిటల్‌లో ఈ సంక్లిష్ట ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించగా, వాటిని ఓ హోటల్ ఏర్పాటు చేసిన సీఎంఈ ప్రోగ్రామ్ ద్వారా వైద్యులకు ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ అరుదైన నాలెడ్జ్ షేరింగ్ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 300 మందికి పైగా సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు, పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు.సదస్సులో భాగంగా ఎంపిక చేసిన ప్రత్యక్ష శస్త్రచికిత్సలను ప్రముఖ వైద్యుడు డాక్టర్ సాయి వీర్ల, డాక్టర్ నితిన్ కుమార్ బెజ్జంకి, డాక్టర్ పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ రమాకాంత్ రాజగోపాల్ కృష్ణన్, డాక్టర్ సుఖేష్ రావు సమర్థవంతంగా నిర్వహించి,తోటి వైద్యులకు, విద్యార్థులకు లైవ్ ద్వారా వివరించారు.కార్యక్రమ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బంగారు స్వామి మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి అత్యాధునిక సాంకేతిక సదస్సులు కేవలం ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకే పరిమితమయ్యేవని గుర్తుచేశారు. నేడు కరీంనగర్ లాంటి జిల్లా కేంద్రంలోనే అంతర్జాతీయ స్థాయి వైద్య సదస్సు జరగడం స్థానిక వైద్య విద్యార్థులకు, సర్జన్లకు ఎంతో జ్ఞానాన్ని పెంపొందిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ సదస్సుకు వచ్చి విజయవంతం చేసిన తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి వి, తెలంగాణ ఆర్థోస్కోపిక్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె ప్రసాద్ పెద్ది, ఇండియన్ ఆర్థోస్కోపిక్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ శ్రీధర్ గంగవరపులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ లైవ్ సర్జరీల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ మునీష్, డాక్టర్ కృష్ణా రెడ్డిలతో పాటు ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.






# బ్లూ బెల్స్ లో వేసవి శిక్షణ శిబిరం ముగింపు

**కరీంనగర్ టౌన్, (ప్రభాతవార్త):**

కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గత నెల 27న ప్రారంభమైన ఈ శిబిరంలో కరాటే, అబాకస్, హ్యాండ్‌రైటింగ్, డాన్స్, ట్రెడిషనల్ గేమ్స్, రోబోటిక్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్ విద్యా, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు.ప్రత్యేకంగా పదో తరగతి విద్యార్థులకు గణితము, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాలలో ఫండమెంటల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందించారు. వేసవి శిక్షణతో పాటు ఆటపాటల ద్వారా విద్యార్థులు సులభంగా విషయాలను అర్థం చేసుకొని తమ ప్రాథమిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు.శిబిరం ముగింపు సందర్భంగా బ్లూ బెల్స్ పాఠశాల కరస్పాండెంట్ ,ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.



రోబోటిక్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకోగా, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.ఈ సందర్భంగా జంగ సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, "వేసవి శిబిరాల ద్వారా పిల్లలు మొబైల్, టీవీలకు పరిమితం కాకుండా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకొని మేధాశక్తిని పెంపొందించుకుంటారని పేర్కొన్నారు.విద్యతో పాటు వినోదాత్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా పోచమ్మ బోనాలు...

**తిమ్మాపూర్, (ప్రభాత వార్త) :**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లి గ్రామంలో గౌడ



సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ళతో శివ సత్తుల పూనకాలతో నెత్తిన బోనాలు ఎత్తుకొని పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని దేవాలయం చుట్టూ మూడు చుట్లు తిరిగి బెల్లము శాఖ నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండి, గొడ్డుగోదా పిల్ల పాపలతో అందరూ చల్లగా ఉండాలని పోచమ్మ తల్లి దీవెనలు ఎప్పుడు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ తిరుపతి గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు పడాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ బూడిగ కొండయ్య గౌడ్, బండారి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# శిలా ఫలకాలకే పరిమితమా నాటి పరిపాలన ?

**చిగురుమామిడి, (ప్రభాత వార్త) :**

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామం లో ఆరోగ్య ఉప కేంద్ర భవనం నిర్మాణం 2022 సంవత్సరం లో అప్పటి ఎమ్మెల్యే ఒడితెల సతీష్ కుమార్ శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. నిర్మాణం గురించి అప్పటి సర్పంచ్ పట్టించుకోలేదు, కాంట్రాక్టర్ అసలే పట్టించుకోలేదు. కేవలం



ఐరన్ పిల్లర్ స్టేజి లోనే ఆగిపోయిందని ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి సదరు కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రస్తుత పాలక వర్గం సైతం అడిగినా ప్రయోజనం లేదని అసలు ఆ కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని ప్రస్తుత సర్పంచ్ అంటున్నారు. ఇన్ని రోజులుగా కేవలం కాంట్రాక్టర్ అసమర్థతే ఇందుకు కారణం అని వారు అంటున్నారు. ఇలా అభివృద్ధి పనులను అడ్డుకునే కాంట్రాక్టర్ లను పెంచి పోషించింది అప్పటి ప్రభుత్వ పరిపాలన అని, శిలా ఫలకాలకే పరిమితం అనేది బొమ్మనపల్లి ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం చూస్తేనే అర్థం అవుతుందని అంటున్నారు.

# హుజురాబాద్‌లో ఉత్సాహంగా హ్యాపీ సండే....

**-- శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం అవసరం**

**-- మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని**

**జమ్మికుంట/హుజురాబాద్, (ప్రభాత వార్త):**

ప్రజల్లో శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హ్యాపీ సండే కార్యక్రమం హుజురాబాద్ పట్టణంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలవు దినం కావడంతో పట్టణ ప్రజలు, యువకులు, మహిళలు, వాకర్స్ పెద్ద సంఖ్యలో తరలివచ్చి మైదానాన్ని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని.. కేవలం వేదికపై ప్రసంగానికే పరిమితం కాకుండా, స్వయంగా యోగాసనాలు, కరాటే ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విద్యార్థులు, శిక్షకులతో కలిసి ఆమె అడుగులు వేస్తూ పాల్గొన్న వారిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మైదానంలో ఏర్పాటు చేసిన యోగా, కరాటే, జుంబా నృత్య ప్రదర్శనలు వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతూ చూసేందుకు వచ్చిన పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ.. నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి తన కుటుంబం గురించి, సొంత ఆరోగ్యం గురించి పట్టించుకునే సమయం లేనంతగా బిజీ అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటేనే జీవితంలో ఏదైనా సాధించగలమనే విషయాన్ని చాలామంది అలస్యంగా గుర్తిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం చాలా మంది వైద్యులు హెచ్చరించిన తర్వాతే నిద్ర లేచి వాకింగ్‌కు వస్తున్నారు. ఆ పరిస్థితి రాకముందే మన ఆరోగ్యం కోసం మనమే స్వచ్ఛందంగా ప్రతిరోజూ ఉదయం వ్యాయామం, యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలని, నిత్యం ఒత్తిడితో సతమతమయ్యే పట్టణ ప్రజలకు ఈ హ్యాపీ సండే ఒక మంచి రిఫ్రెష్‌మెంట్‌గా నిలుస్తుందని అన్నారు. ఈ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ హంగామాలో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, కౌన్సిలర్లు ఇల్లందుల సమ్మయ్య, మొగిలి, సొల్లు సునీత, నాంపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఆలేటి సుశీల, గొట్టె జమదగ్ని, ప్రముఖ నాయకులు కేసిరెడ్డి నర్సింహారెడ్డి, కోయల్కార్ బాలాజీ, తాళ్లపల్లి రమేష్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మతిన్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, మక్కపల్లి రమేష్, కరాటే మాస్టర్ బాపూరావుతో పాటు మున్సిపల్ అధికారులు రషీద్, ఇల్లందుల రమేష్, ప్రతాప రాజు, రమేష్, అనిల్, వెంకటేష్, డి. శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట/హుజురాబాద్, (ప్రభాత వార్త):**

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజురాబాద్‌లో ఆయన హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిపారు. ఈ సమావేశంలో హుజురాబాద్ మండలం, జమ్మికుంట మండలం, కమలాపూర్ మండలం, వీణవంక మండలం, ఇల్లంతకుంట మండలం, హుజురాబాద్ పట్టణం, జమ్మికుంట పట్టణానికి చెందిన పార్టీ సమన్వయ కమిటీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం అందరి కృషి వల్ల సభ్యత్వాలలో అగ్రగామిగా నిలవాలని, ప్రజల్లో బిఆర్ఎస్ పార్టీపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సభ్యత్వాల విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మిగతా నియోజకవర్గాల కన్నా ముందుగా మనం పని చేసి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టిపిసిసి అధ్యక్షులు పుట్టినరోజు సందర్భంగా ఇల్లందకుంట దేవాలయంలో ప్రత్యేక పూజలు

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:

ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది



కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం పార్టీ బలోపేతానికి, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్ గారు యువతకు ఆదర్శప్రాయ నాయకుడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న సేవలు విశేషమైనవి. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమన్వయంతో ముందుకు నడిపించే నాయకత్వం ఆయన సొంతమని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, బీసీల సాధికారత, సామాజిక న్యాయం కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ఆయన నిత్యం ప్రజా సేవలో నిమగ్నం కావాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని ఉన్నత పదవులు కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ది శివకుమార్, కాంగ్రెస్ నాయకులు కనుమల్ల సంపత్, ఎక్కటి సంజీవరెడ్డి, సర్పంచులు కోరుకండ్ల శ్రీనివాస్, ఆరెల్లి రమేష్, బైరెడ్డి కొండల్ రెడ్డి, జిల్లెల్ల సందీప్ రెడ్డి, మర్రి వీరారెడ్డి, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గైకోటి రాజు, దంసాని తిరుపతి, భోగం పృథ్వీరాజ్, ఆరే రమేష్ రెడ్డి, గూడపు ఓదెలు, మారపల్లి వేణు, కొత్తూరు రాజేందర్, జక్కు కుమార్, మారేపల్లి వంశీ, జలంధర్ రెడ్డి, ధార నరేష్, బోయిన్ విష్ణులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మడిపల్లి తాటి ఈత వనం అగ్నిప్రమాద బాధిత గౌడ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.....

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఈత,తాటి వనం పూర్తిగా దగ్ధమై గౌడ సోదరులు తీవ్రంగా నష్టపోయారని నష్టపోయిన గౌడ బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదివారం అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని సందర్శించి అగ్ని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలతో మాట్లాడిన ఎమ్మెల్యే జరిగిన నష్టంపై ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం కారణంగా జీవనాధారం కోల్పోయిన గౌడ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు.బాధితులకు తక్షణ నష్టపరిహారం అందించాలంటూ జిల్లా అదనపు కలెక్టర్ తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. అలాగే ఎక్సైజ్ సీఐ తో మాట్లాడి సంబంధిత శాఖల ద్వారా బాధిత కుటుంబాలకు వెంటనే సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి గౌడ సోదరులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో పాటు కేడిసిసిబి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, జమ్మికుంట పిఎసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావెద్, ఇల్లందకుంట మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేష్, స్థానిక నాయకులు, గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు



## రావికంటి రాజయ్య చూపు సజీవం.....

### నేత్రదానంతో ఇద్దరి అందులకు జీవితాల్లో వెలుగులు...

### అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

కరీంనగర్ జిల్లా,జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ నివాసి రావికంటి రాజయ్య(80) ఆదివారం వృద్ధాప్యంతో మృతి చెందారు.గర్రెపల్లి వెంకటేశ్వర్లు ఇచ్చిన సమాచారము మేరకు సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా , కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరహరి



ఆధ్వర్యంలో, వరంగల్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలను సేకరణ చేసి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ కు పంపడం జరిగింది.రావికంటి రాజయ్యనేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుమారులుకోడల్లు రావికంటి నీలకంఠంశ్రీలత, వెంకటేశ్వర్లునీరజ లకి. సహకరించిన డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు,చిటికేసి శివానందయ్య , ముత్యాల జగదీశ్వర్ , చిదురాల శ్రీనివాస్ , వంగల రమేష్ , సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి,ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి,ప్రచార కార్యదర్శి వాసు ,లగిశెట్టి చంద్రమోళి,బంధు మిత్రులకు అభినందనలు ధన్యవాదాలు తెలిపారు.

## జమ్మికుంట మండల నూతన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా మహమ్మద్ ముస్తఫా...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్ యూనియన్ ను ఆదివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షునిగా మహమ్మద్ ముస్తఫా ఉపాధ్యక్షునిగా ఎర్ర రాజు సెక్రటరీగా దొడ్డే ఆంజనేయులు కోశాధికారిగా సుంకరి రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా,ఉపాధ్యక్షులు ఎర్ర రాజు మాట్లాడుతూ జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

## ఘనంగా మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని, ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, మాజీ చైర్మన్ వడ్లూరు విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మేకల తిరుపతి, మండల అధ్యక్షులు కిరణ్, మహిళా మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, పలువురు కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# హుజూరాబాద్ వార్త



## కమలాపూర్‌లో ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కమలాపూర్: ప్రభాత వార్త.

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కమలాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డాక్టర్ మోటం కుమార్ స్వామి ఆధ్వర్యంలో, పార్టీ శ్రేణులతో ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డిసిసి



జనరల్ సెక్రెటరీ మాట్లా రమేష్ మాట్లాడుతూ, "బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపారు. ఆయన నాయకత్వంలో పార్టీ తిరుగులేని శక్తిగా ఎదుగుతోంది" అని కొనియాడారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేరుస్తోంది. ముఖ్యంగా బీసీలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోంది. టీపీసీసీ అధ్యక్షుడి దిశానిర్దేశంలో ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నాం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోకమలాపూర్ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్,డిసిసి కార్యదర్శి ఆడెపు విజయ, మాజీ ఎంపీపీ తడక శ్రీకాంత్, పార్టీ నాయకులు, శ్రేణులు, పెరుమాండ్ల పరుశురాములు,శ్రీనివాస్, భరత్, కృష్ణమూర్తి, నరసింహారెడ్డి, సాంబయ్య, రాజిరెడ్డి, కనకరత్నం, మహేష్, మిట్టపల్లి సుభాష్, అంకుష్, సారంగపాణి, రవికుమార్, భాష బోయిన రమేష్, గాలిబు నవీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు మొగిలిచర్ల శ్రీనివాస్, శ్రీకాంత్,పుల్ల శోభన్, శివానందం, భద్రయ్య, రమేష్ మహేందర్, రాజు, పాల్గొన్నారు.

## ఘనంగా టీపీసీసీ అధ్యక్షుని జన్మదిన వేడుకలు .

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండల కేంద్రంలో నీ బస్ స్టాండ్ ప్రాంతములో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 62 వ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి,మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి. సాహెబ్ హుస్సేన్ ల ఆధ్వర్యములో ఆదివారం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం రఘుపాల్ రెడ్డి,సాహెబ్ హుస్సేన్,మాజీ విండో చైర్మన్ గంగాడి తిరుపతి రెడ్డి లు మాట్లాడుతూ మహేష్ కుమార్ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్ష పదవి భాధ్యతలు చేపట్టి విద్యార్థి లోకానికి అందించారన్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడని కొనియాడారు.రాబోయే కాలంలో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కర్ర భగవాన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ,జగదీశ్వర్ రెడ్డి,మాజీ సర్పంచులు చిన్నాల ఐలయ్య,ఎల్లారెడ్డి,మధుకర్,సతీష్,తిరుపతిరెడ్డి,డైరెక్టర్ రషీద్ నాయకులు మోటము శ్రీనివాస్, మధుకర్ రెడ్డి,మిరియాల సమ్మిరెడ్డి,గాజుల శ్రీనివాస్,అందే కుమార్,రాపర్తి రవి,నాగరాజు లతో పాటు పాల్గొన్నారు.



# క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పెద్దపల్లి

కోఆర్డినేటర్ పల్లె శాంరాజ్

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు వినతి

పెద్దపల్లి, ప్రభాతవార్త:



క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఎఐసిఎఫ్) పెద్దపల్లి కోఆర్డినేటర్, సామాజిక కార్యకర్త, సంపాదకీయుడు పల్లె శాంతిరాజ్ కోరారు. శనివారం హైదరాబాదులోని మినిస్టర్స్ క్వాటర్స్ లో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీ వేదికగా దళిత క్రైస్తవ హోదా విషయమై తీర్మానం చేసి నాటి కేంద్ర ప్రభుత్వానికి నివేదించినట్లుగా నేటి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సామాజిక నేపథ్యానికి చెందిన దేశ పౌరులు మత స్వేచ్ఛను ఉపయోగించుకొని వేరే మతంలోకి వెళ్ళినప్పుడు కుల రిజర్వేషన్ తొలగించడం అనేది అన్యాయమని అన్నారు. గతంలో రంగనాథ మిశ్రా కమిషన్ లో మతానికి కులానికి లంకె పెట్టి చూడొద్దని నివేదిక ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. హిందూమతంలో ఉన్న దళితులు సిక్కు మతంలోకి వెళ్ళినప్పుడు 1956లో వారికి ఎస్సీ హోదాను ఇచ్చారని, అలాగే 1990లో హిందూమతంలో ఉన్న ఎస్సీలు బౌద్ధ మతాన్ని స్వీకరించినప్పుడు వారికి కూడా ఎస్సీ రిజర్వేషన్లు కల్పించారని వివరించారు. కానీ అణిచివేతకు గురవుతున్న ఎస్సీ నేపథ్యం కలిగి ఉన్న క్రైస్తవులకు మాత్రం ఎస్సీ రిజర్వేషన్ తొలగించడం సరి అయింది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వాసాల నతనియల్, పెద్దపల్లి సిపిఐ ప్రధాన కార్యదర్శి తాండ్ర సదానందం పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే కార్డన్ అండ్ సెర్చ్

పెద్దపల్లి డీసీపీ బి.రాంరెడ్డి

గోదావరిఖని తిలక్‌నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జోన్ డీసీపీ బి.రాంరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్‌డివిజన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తిలక్‌నగర్‌లో నేర నియంత్రణ, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గోదావరిఖని ఎసిపి మడత రమేష్ నేతృత్వంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తమ వాహన పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుని సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఫైన్ల భయం కోసం కాకుండా ప్రాణరక్షణ కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, కేవలం తక్కువ దూరం పాల కోసమో లేదా కూరగాయల కోసమో వెళ్లేటప్పుడు హెల్మెట్ అవసరం లేదనే ఆలోచన చాలా ప్రమాదకరమని అన్నారు. ప్రమాదం ఎప్పుడు ఎక్కడ సంభవిస్తుందో ఎవరికీ తెలియదని, కాబట్టి ప్రతి ప్రయాణంలోనూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం, అతివేగంతో ప్రయాణించడం వల్ల మీ ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ అపరిచిత లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయడం ద్వారా బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మును పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అదనపు డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు లోనై మోసపోవద్దని సూచించారు. మోసపోయిన తర్వాత 100 లేదా 1930 నెంబర్లకు కాల్ చేయడం కంటే, ముందుగానే అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తపడటం ఉత్తమమని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరరహిత సమాజ స్థాపనలో పోలీసులతో పాటు ప్రజల పాత్ర కూడా ఎంతో కీలకమని అన్నారు. ప్రజలే యూనిఫాం లేని పోలీసులని పేర్కొంటూ, తమ పరిసరాల్లో జరుగుతున్న అనుమానాస్పద, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల చొరవతోనే సమాజంలో నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని అన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాల పట్ల పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. గంజాయి సరఫరా లేదా విక్రయాలపై ఎలాంటి సమాచారం అందినా వెంటనే స్పందించి, వాటిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలుచేపడతామని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజల సహకారం అత్యంత అవసరమని, ఏ చిన్న అనుమానాస్పద సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత జీవితంలో కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని, మత్తుకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరణ ధృవీకరణ పత్రం అందజేసిన సర్పంచ్ సతీష్

ఓదెల,ప్రభాతవార్త:

ఓదెల మండల కేంద్రంలో ఇటీవల వృద్ధాప్యంతో మరణించిన మాటేటి



లక్ష్మీ [illegible] కుటుంబ సభ్యులకు మరణ ధృవీకరణ పత్రం అందజేసిన స్థానిక సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ వారి కుమారులు మాటేటి రాజనర్సయ్య,వెంకటేశం,రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ సర్పంచ్ ఎక్కడ లేని విధంగా మమ్మల్ని అన్ని వివరాలు అడిగి గ్రామపంచాయతీ కార్యదర్శి ని ఇంటికి పంపించి మరణ ధృవీకరణ పత్రంకు సంబంధించి అన్ని ఫార్మాలిటీస్ తీసుకొని ఇంటికి వచ్చి మాకు మరణ ధృవీకరణ పత్రం ఇవ్వడం చాలా సంతోషం అని సర్పంచ్ సతీష్ కు పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాటేటి సతీష్ మెరుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతకు వడదెబ్బతో మెకానిక్ మృతి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త:



ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి ఒక మెకానిక్ మృతి చెందిన ఘటన గోదావరిఖనిలో చోటుచేసుకుంది. తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన కూరెళ్ళ సంపత్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఆది వారం ఉదయం 9 గంటలకు యథావిధిగా పని నిమిత్తం బయటకు వెళ్లిన సంపత్, ఉదయం 11:25 గంటల సమయంలో మేదరి బస్తీలోని కల్లు డిపో ఎదురుగా ఉన్న ఇంటి గద్దెపై విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆయన వడదెబ్బకు గురై అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. మృతుడు వివాహం కాకుండా తన అన్న సారయ్య వద్దే ఉంటున్నారు. మృతుని అన్న సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై కె. రమేష్ తెలిపారు.

# పెద్దపల్లి వార్త

## దుండగుల దుశ్చర్యతో అగ్నికి ఆహుతైన పొలాలు

-రైతుల మోటర్లు, పైప్‌లైన్లు బూడిద..

-పామ్ ఆయిల్ మొక్కలకు నష్టం

ఎన్టీపీసీ, ప్రభాతవార్త:





మల్యాపూర్ శివారులోని హను మాన్ మందిరం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పం టించిన ఘటన రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మంటలు వేగంగా వ్యాపించి పొలాల్లో ఉన్న మోటర్లు, పైప్‌లైన్లు, విద్యుత్ వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న పామ్ ఆయిల్ మొక్కలకు కూడా మంటలు అంటుకుని నష్టం జరిగింది. సమాచారం అందుకున్న అగ్ని మాపక శాఖ అధికారులు వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే భారీ నష్టం సంభవించినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## మిషన్ భగీరథకు అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయంగా బావి నీటి సరఫరా

-తాగునీటి కొరత లేకుండా పంచాయతీ ముందస్తు చర్యలు

-మంచినీటి బావి మోటార్ సిద్ధం చేసిన సర్పంచ్ నర్ల కనకమ్మ,

ఉప సర్పంచ్ పర్స లక్ష్మీ [illegible] శంకర్

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్, మోటర్లు తరచూ సాంకేతిక సమస్యల వల్ల పాడవుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. రిపేర్ల వల్ల గ్రామంలో తలెత్తుతున్న తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా ఒక ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజు, ఉప సర్పంచ్ పర్స లక్ష్మీ శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ మంచినీటి బావి మోటార్‌ను విజయవంతంగా రిపేరు చేయించి, పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలిగిన సమయంలోనైనా, ఈ బావి నీటి ద్వారా గ్రామస్థులకు తాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా నీటిని సరఫరా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్రామ ప్రజ లందరూ ఈ విషయాన్ని గమనించి, తాగునీటిని అస్సలు వృధా చేయకుండా చాలా పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు గ్రామ పెద్దలు కోరారు.

# కుల సంఘాల భవనాలకు నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యే సత్యం

## ఎమ్మెల్యే సత్యం ను సన్మానించిన సంఘ పెద్దలు

చొప్పదండి,ప్రభాతవార్త: కుల సంఘాల అభివృద్ధిలో భాగంగా వారి అవసరాలైన శుభకార్యాల కోసం, ఇతర సంఘ నిర్మాణ కార్యక్రమాల కోసం భవనం నిర్మాణం అవసరాలకు ఎమ్మెల్యే పైడిపల్లి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని రెడ్డి సంఘం, మున్నూరు కాపు సంఘం, గౌడ సంఘం భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వాటి మిగులు పనులకు గాని ఐదు లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. అలాగే ఆర్నకొండ గ్రామంలో నాయి బ్రాహ్మణ సంఘం నూతన భవనానికి 5 లక్షల రూపాయలు నిధులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం మంజూరు పత్రాలను కుల సంఘాల పెద్దలకు ఎమ్మెల్యే సత్యం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరు సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు కొట్టె సునీత అశోక్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, వలుగొత్తుల సురేష్, గుర్రం రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షులు గుర్రం సుజిత్ రెడ్డి, ముద్దం రాజేశ్వరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, గుర్రం రమేష్, మచ్చ రమేష్, సీతవో కళ్యాణ్ తిరుపతిరెడ్డి, గుర్రం నంది రెడ్డి, గుర్రం రమణారెడ్డి, మారు తిరుపతిరెడ్డి, గుర్రం రవీందర్ రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.



చొప్పదండి వార్త



# ప్రమాదవశాత్తు అంటుకున్న పంట పొలాల కోయ కాళ్ళు

## పక్కనే ఉన్న పెట్రోల్ పంపునకు తప్పిన పెను ప్రమాదం

చొప్పదండి,ప్రభాతవార్త: పట్టణంలోని సబ్ స్టేషన్ కు కొద్ది దూరంలో ఉన్న భారత్ పెట్రోలియం పంపు వెనుక ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అగ్ని రాజేయ డంతో అకస్మాత్తుగా వరి కోతలు పూర్తి కావడంతో మిగిలిన వారి కొయ్య కాళ్ల తోపాటు గట్టి అకస్మాత్తుగా అడ్డుకొని దారాలంగా మంటలు వ్యాపించడంతో పాటు మరో ప్రక్క గాలులు తీవ్రంగా వేస్తుండడంతో ఒక్కసారిగా పంటలు పువ్వెత్తున ఎగిసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన కొందరు వెంటనే అగ్నిమాపక కేంద్రం సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అగ్నిమాపక కేంద్రం నీటిని నింపుకొని రావడంతో పాటు అక్కడికి చేరుకున్న రైతులు, ఇతరుల సహకారంతో మంటలను చాకచక్యంగా ఆర్పి వేశారు. అయితే పక్కనే భారత్ పెట్రోలియం పంపు ఉండడంతో అటువైపు రాకుండా ముందస్తుగానే అగ్నిమాపక సిబ్బంది నీటిని పంపు చేయడంతో అటువైపు మంటలు తగ్గి మరో పక్కకు వ్యాపిస్తుండగా వాటిని సాకచక్యంగా అగ్నిమాపక సిబ్బంది ఆర్పి వేశారు. అది కాకుండా పక్కనే తూకం వేసిన రైతుల ధాన్యం బస్తాలలో వేలకింటాల్లో అక్కడే ఉంది. ఆ బస్తాలు అంటుకోకుండా అగ్నిమాపక సిబ్బంది నీటిని పంపు చేయడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరగకుండా అవకాశం ఏర్పడింది. పంటలు పూర్తిగా ఆరిపోవడంతో ఆ ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు.



# గత జ్ఞాపకాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చొప్పదండి,ప్రభాతవార్త:



పూర్వ విద్యార్థుల సమ్మేళనంచొప్పదండి లోని వీణాధరి విద్యానికేతన్ హైస్కూల్ కు చెందిన 200708 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక ప్రైవేట్ మినీ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ వేడుకలకు హాజరైన అప్పటి విద్యార్థిని విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లోని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం వారికి బోధించిన టీచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీచర్లు టి. శ్రీనివాస్, కె. శ్రీనివాస్, ఎం. రమేష్, ఎ. నాగరాజు, మల్లేశం, శ్రీవాణి, గంగారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట.. జీలుగ ఎరువులు అందుబాటులో

చొప్పదండి,ప్రభాతవార్త:



పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ కావాల్సిన రైతులు చొప్పదండి, ఆర్నకొండ పిఏసిఎస్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మమత ఆదివారం తెలిపారు. భూమి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్,మొబైల్ ఫోన్ తీసుకొని వెళ్లి కొనుగోలు చేయవచ్చని, జీలుగ కేజీ 2452 రూపాయల 50పైసలు అని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మమత కోరారు.

# కొండగట్టు అంజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

మల్యాల/ప్రభాతవార్త



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉద్యోగులకుసెలవు దినం, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా భక్తులు జై శ్రీరామ్,,, జై హనుమాన్ నామస్మరణతో ఆలయం మారు మోగింది, ఇదిలా ఉండగా భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షి స్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు.తాగునీరు, క్యూలైన్లు, ప్రసాద పంపిణీ, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రద్దీ దృష్ట్యా పోలీసు సిబ్బంది భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

# నీటి సరఫరాను పునరుద్ధరించిన సర్పంచ్ కుమార్

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో రెండు చోట్ల బోరు బావుల మోటార్లు కాలిపోయి ఎస్సీ కాలనీలో నీటి సరఫరా నిలిచిపోయి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున స్పందించిన గ్రామ సర్పంచ్ గ్యాతం కుమార్ ఆదివారం కాప్వాల గడ్డ ప్రాంతంలో ఉన్న బోరు బావులకు కొత్త మోటర్లను వెంటనే తెప్పించి వాటిని అమర్చే పనుల్లో పాల్గొని, ప్రజలకు మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు, కాగా, సర్పంచ్ కుమార్ మరమ్మతు పనుల్లో పాల్గొని కాలనీకి నీటి సరఫరా కొనసాగించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు,

# వాహనాలపార్కింగ్ కేంద్రంగా మారిన ప్రయాణ ప్రాంగణం

మల్యాల/ ప్రభాతవార్త



మండల కేంద్రంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారడంతో ప్రయాణ ప్రాంగణం కాస్త ప్రైవేటు వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారింది, రూ ,లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం దాపురించింది, ప్రయాణికులు ఉండాల్సిన ప్రాంగణంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్ అడ్డగా మారడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని ప్రయాణికులకు అందుబాటులో బస్టాండ్ వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజల పేర్కొంటున్నారు,

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న కరీంనగర్ నగర మేయర్

మల్యాల /ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని ఆదివారం కరీంనగర్ మున్సిపల్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు, అనంతరం ఆలయ అర్చకులు మేయర్ దంపతులకు వేదోక్త ఆశీర్వచనాలు అందించి శేష వస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదం అందజేశారు, కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రఘు, ముఖ్య అర్చకులు రాము, చిన్న రాము, అభిలాష్ తోపాటు ఔట్ పోస్ట్ ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు,

# ఆర్థిక సహాయం అందజేత

గంగాధర,ప్రభాత వార్త :



గంగాధర మండలం లోని మల్లాపూర్ గ్రామానికి చెందిన గుండ పుష్పలత ఇటీవల అనారోగ్య బారినపడి చనిపోవడం జరిగింది కాగా వీరు నిరుపేద కుటుంబని కి చెందిన వారు అవడంతో ఈ విషయాన్ని టీ యల్ యువసేన సభ్యులు సామాజికవేత్త తుడి లచ్చన్న కు తెలుపగానే మానవతా హృదయంతో స్పందించి పదివేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందజేసారు.టి యల్ యువ సేన సభ్యులు పాల్గొన్నారు

# రోడ్డు పనులను వేగవంతం చేయాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మొగుళ్లపల్లి, మే 24, ప్రభాత వార్త: మండలం అకినపల్లి నుండి అందుపుల గ్రామానికి జరుగుతున్న రోడ్డు పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రోడ్డు ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని, నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించిన శ్రీ అద్వైతానంద భారతి స్వామిజీ

**వేములవాడ, ప్రభాతవార్త:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని శంకరాచార్య మహాసంస్థానం అవని శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీ అద్వైతానంద భారతి స్వామిజీ ఆదివారం దర్శించుకున్నారు. పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు, కాళేశ్వరం దర్శనం అనంతరం వారు వేములవాడకు వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న స్వామిజీకి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తివాచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించగా, ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బిక్షావందనం సమర్పించారు. అనంతరం ఆలయ ఈవో రమాదేవి స్వామిజీకి స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని



అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అడ్వైజర్ గోవింద హరి, ఆలయ డిఈఓ భాస్కర శర్మ, ఏఈఓలు జి.శ్రావణ్ కుమార్, జి.అశోక్ కుమార్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి సంబరాలు**

**నిర్వహించిన పట్టణ కాంగ్రెస్ నాయకులు**

**వేములవాడ టౌన్, ప్రభాతవార్త:**

రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయం ముందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూము మధు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫుల్కం రాజు మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి కష్టపడి ఎదిగి రాష్ట్ర స్థాయి నాయకుడిగా నిలిచిన ఆయన



సేవలు అభినందనీయమన్నారు. . వేములవాడ రాజన్న ఆశీస్సులతో మహేష్ కుమార్ గౌడ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండా శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకట స్వామి, పట్టణ మాజీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ నాయకులు కూరగాయల కొమరయ్య, పాత సత్య లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యులు ఫిర్ మొహమ్మద్, కట్కూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

**వేములవాడ, ప్రభాతవార్త:**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని కళ్యాణ మండపంలో ఈ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం, సభ్యులతో ప్రమాణ స్వీకారం



చేయించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతోపాటు కార్యవర్గం, సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ టియుడబ్ల్యూజె హెచ్ 143 సంఘ బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తామన్నారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరీ కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతోపాటు సభ్యులున్నారు.

# కాంగ్రెస్ మండలాధ్యక్షుడుకి సన్మానం

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:**



కోనరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానక సత్యము ఘనంగా సన్మానించినట్లు మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కచ్చకాయల బాలరాజు తెలిపారు. ఆదివారంమండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల అధ్యక్షున్ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు వెళ్లాలని, అందర్నీ కలుపుకొని గడపగడపకు పార్టీని తీసుకు వెళ్లాలన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మర్తన్నపేట ఉప సర్పంచ్ బోనాల పునీత్, నాయకులు ఐదరి శ్రీనివాస్, ముదాం ప్రదీప్, రాజమల్లేశం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షుని జన్మదిన వేడుకలు

**ప్రభాతవార్త కోనరావుపేట:**

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కొనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు మానక సత్యం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహేష్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మార్కెట్ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య చేపూరి గంగాధర్ గొట్టే రుక్మిణి ఫిరోజ్ పాషా సింగల్విండో చైర్మన్ బండ నర్సయ్య మార్కెట్ డైరెక్టర్లు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడ వార్త

# పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ఘనంగా నిర్వహించిన రూరల్ కాంగ్రెస్ శ్రేణులు**

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త:**



పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో ఎదురు గట్ల వెంకటేశ్వర ఆలయం ముందు ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా మహేష్ కుమార్ గౌడ్ పేరుమీద ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు పరస్పరం స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. త్వరలోనే కొత్త పెన్షన్లు కూడా మంజూరు కానున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, జిల్లా సెక్రటరీ వకులాభరణం శ్రీనివాస్, సర్పంచ్‌లు అడ్డిక శ్రీనివాస్ రెడ్డి, నేదూరి నరసయ్య శంకర్, చింతపంటి మల్లేశం, మనుపాటి పర్శరాములు , వెంకటేష్, యూత్ ప్రెసిడెంట్ రోమాల ప్రవీణ్, ఆత్మ కమిటీ సభ్యులు బండ శ్రీనివాస్, జాగిరి సురేష్, నేదూరి రమేష్, కొంరయ్య, శంకరయ్య, మల్లేశం, భూమిరెడ్డి, నాగేందర్, రాజు, జగదీశ్,ఎడపల్లి విష్ణు తదితరులతో పాటు రూరల్ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# చందుర్తిలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**చందుర్తి / ప్రభాతవార్త:**

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు గొట్టే ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహేష్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ సారధ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని కోరారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామి ఆత్మ కమిటీ అధ్యక్షులు ముస్కు ముకుంద రెడ్డి నాయకులు పులి సత్యం, ధర్మపురి శ్రీనివాస్, ఆదిత్య రెడ్డి,భూమేష్, దారం చంద్రం, కత్తి శంకర్ గౌడ్, దేవస్వామి, ప్రసాద్ , సలీం, ఈసరి శ్రీనివాస్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ డిపెండెంట్ ఉద్యోగాలు పరిష్కరించకపోవడం హేయమైన చర్య

సింగరేణిపై అవగాహన లేని ముఖ్యమంత్రి

బిజెపి జిల్లా నాయకులు శ్రీనివాస్ పటేల్

రామగిరి ప్రభాతవార్త

గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణిలో పెండింగ్ లో ఉన్న విజిలెన్స్ కేసులు పరిష్కరించకపోవడం హేమమైన చర్య అని సింగరేణి సంస్థపై అవగాహన లేని మొట్టమొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని బిజెపి జిల్లా నాయకులు మోల్మూరి శ్రీనివాస్ పటేల్ అన్నారు. ఆదివారం రామగిరి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కార్మిక కుటుంబాలు రోడ్డు మీద పడుతున్న కూడా సింగరేణి కంపెనీ వీరుని పట్టించుకోకపోవడం బాధాకరమని గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగాలు లేక కుటుంబాలు రెక్క ఆడితే కానీ డొక్కాడని పరిస్థితికి వచ్చాయని అయినా కూడా సింగరేణి అధికారులు కార్మికుల గోడు వినడం లేదన్నారు. కుమారునికో లేక అల్లుడికో కూతురుకి ఉద్యోగమిద్దామనుకొని మెడికల్ అన్ ఫిట్ అయిన తర్వాత కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వమంటే సింగరేణి కంపెనీ మీ పేర్లు తప్పు ఉన్నాయని మీ కులాలు వేరు ఉన్నాయని వారిని ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండగా ఉద్యోగం ఇవ్వని ఎడల 25 లక్షల రూపాయలు కూడా



ఇవ్వకుండా కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురి చేయడం హేమమైన చర్య అని అన్నారు. సింగరేణి యాజమాన్యం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అధికారుల తీరు మారడం లేదని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజిలెన్స్ కేసులో పరిష్కరించాలని చెప్పినా కూడా వాళ్ల మాట వినలేదని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సింగరేణి కంపెనీ మీద అవగాహన లేదని ఐ ఎన్ టి సి నాయకులు కూడా ఈ యొక్క సమస్యను పరిష్కరించడం లేదన్నారు. వీరి సమస్యను పరిష్కరించకపోతే విజిలెన్స్ కేసులో ఉన్న కార్మిక కుటుంబ సభ్యులందరిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్ సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్, కమలాకర్ పాల్గొన్నారు.

# నేటి నుండి రోహిణి కార్తె ప్రారంభం

మరింత దంచి కొట్టనున్న ఎండలు

ఎండల బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోండి

మంథని ప్రభాతవార్త:

గత వారం రోజుల నుండి ఎండ తీవ్రత రోజుకు పెరిగిపోవటంతో పాటు ఎండ వేడిమి కి పిట్టల్లా మనుషుల ప్రాణాలు రాలిపోతున్నాయి దీనికి తోడు నేటి నుండి( సోమవారం) రోహిణి కార్తె ప్రారంభం కావడంతో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. రోహిణి కార్తెలో రోళ్ల పలిగే విధంగా ఎండ తీవ్రత ఉంటుంది. ప్రజలు ఎండ వేడిమి నుండి తట్టుకునే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరి అయితేనే గాని ఇంటి నుండి బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్ళవద్దని అదేవిధంగా సాయంత్రం ఐదు తర్వాత బయటకు వెళ్లాలని వారు సూచిస్తున్నారు. ఏంటి దెబ్బకు గురికాకుండా ఉండే విధంగా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకుని బయటకు వెళ్లాలని తలకు తప్పనిసరిగా తలపాగా లేదా టోపీ ని ధరించాలని మంచి నీటిని తరచూ సేవిస్తూ ఒంటిలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం 47 డిగ్రీల ఎండ వేడిమి ఉండగా రోహిణి కార్తి లో సాధారణ రోజుల కన్నా మరో మూడు డిగ్రీలు ఎక్కువగా ఎండ వేడిమి ఉండే అవకాశాలు ఉంటాయి ఈ 15 రోజులు జాగ్రత్తగా ఉంటే వచ్చేది వర్షాకాలం కాబట్టి ఇబ్బందులు ఉండవు. ఏదేమైనా రోహిణి కార్తె వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి

రామగుండం పోలీస్ కమిషనరేట్ కు గర్వకారణం

పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి

రామగిరి ప్రభాతవార్త:

జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అలాగే రామగుండం కమిషనరేట్ కు గర్వకారణం అని పెద్దపెల్లి డిసిపి భూక్య రాంరెడ్డి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ గోదావరిఖని సబ్ డివిజన్ కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కూరపాటి శ్రీలత హర్యానా రాష్ట్రంలో ఈనెల 27 వరకు జరిగే మూడవ పోలీస్ జాతీయ యోగ స్పోర్ట్స్ మీట్ కు ఎంపికయ్యారు. దీంతో ఆమెను డిసిపి రాంరెడ్డి, గోదావరిఖని ఏసిపి మడత రమేష్, వన్ టౌన్



సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డిసిపి రాం రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం జోన్ నుండి ఒకే ఒక్క అథ్లెట్ అయినా కూరపాటి శ్రీలత ఎంపికవడం మన కమిషనర్ రేటుకు గర్వకారణమని అన్నారు. అలాగే గతంలో సైబరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి షీల్డ్ ను అందుకుందని మళ్లీ జాతీయస్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షి ంచారు.

# మామిడితోట దగ్ధం..!

30 ఏళ్ల చెట్లకు నిప్పు

కాలిపోయిన 100 చెట్లు

రూ. 8 లక్షల వరకు ఆస్తి నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న మామిడి రైతు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

ఒకరు చేసిన చిన్న తప్పిదానికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో, ఆ నిప్పురవ్వలు కాస్త మామిడి తోట వ్యాపించి 30 ఏళ్లు పెంచిన 100 మామిడి చెట్లకు నిప్పంటుకుంది. గమనించిన మామిడిరైతు మంటలాపే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కళ్ళ ఎదుట తోటంతా కాలిపోతున్న కాపాడుకోలేని ఆ మామిడి రైతు లబోదిబోమన్నాడు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన దుద్దేటి రాములు మామిడి తోట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 30 ఏళ్ల







పెంచిన పెద్ద మామిడి చెట్ల తో పాటు మామిడి కాయలతో సహా పూర్తిగా కాలిపోయాయి అన్నారు. దాదాపు 100 చెట్ల వరకు కాలిపోగా,ఇందులో తోటకు సంబంధించిన నీళ్ల పైపులైన్లు, డ్రిప్ పైపులు, డ్రిప్ సిస్టం పూర్తిగా దగ్ధమైందన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి కారకులైన వారిని గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని రాములు డిమాండ్ చేశారు. జీవనోపాధి అయిన తోట పూర్తిగా కాలిపోవడంతో ఉపాధి కోల్పోయామని, స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు రాములు కోరారు.

# అనారోగ్యంతో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ మృతి

రామగిరి ప్రభాతవార్త:

కమాన్పూర్ మండల కేంద్రానికి చెందిన మండల ప్రజా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎం డి ఇంతియాజ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన 2019 నుండి 2024 వరకు కో ఆప్షన్ సభ్యులుగా సేవలందించారు. గతంలో టిడిపి, బిఆర్ఎస్ లో పనిచేసిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. రాజకీయాలకు అతీతంగా అందరితో కలివిడిగా స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తిగా ఇంతియాజ్ కు గుర్తింపు ఉంది. ఆయన మృతి పట్ల స్థానిక నాయకులు, మిత్రులు సంతాపం వ్యక్తం చేశారు.



మంథని వార్త

# ఇంకుడుగుంతలను పారిశుద్ధ్య పనులను పరిశీలించిన డిఆర్డీఓ కాళందిని

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలం లో ఆదివారం పెద్దపల్లి జిల్లా డిఆర్డీఓ కాళందిని పర్యటించారు. ఈ సందర్భంగా రత్నాపూర్ తో పాటు పలు గ్రామాలలో ఇంకుడు గుంతలు పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ముఖ్యంగా ఇంకుడు గుంతల నిర్వహణను తనిఖీ చేశారు. నీటిని వృధా పోకుండా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఆమె తెలిపారు. ఈమె వెంట రత్నాపూర్ సర్పంచ్ పల్లె. ప్రతిమ పీవీరావు, ఉపాధి ఏ.పీ.ఎం వరకొల్ల మోనిక,టెక్నికల్ అస్సిటెంట్ మల్క అఖిలా, వార్డ్ సభ్యులు బత్తిని ప్రశాంత్, పున్నం మనీతేజ, ఫీల్డ్ అస్సిటెంట్ సందేవేన జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

# దేవాలయలలో ఎండోమెంట్ అధికారుల తనిఖీలు

రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం రత్నాపూర్, పన్నూర్ గ్రామాలలో పలు



ఆలయాలను ఎండోమెంట్ స్పెషల్ అధికారి రాజబాబు ఆదివారం తనిఖీ చేశారు. రత్నాపూర్ గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం, కోదండ రామాలయలను పన్నూరు గ్రామంలోని వకీల్ పల్లె ఫ్లాట్స్ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, శివ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల లోఎండోమెంట్ అధికారులుదూపదీపనైవేద్యం పనులు సక్రమంగా జరుగుతున్నాయా! లేదా! పరిశీలించారు. దేవాలయ స్థితిగతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపీవీ రావు, చిందం మహేష్, ధూప దీప నైవేద్య పథకం జిల్లా అధ్యక్షులు తిరునహరి శ్రీనివాస చార్యులు, జిల్లా ఉపాధ్యక్షులు కోట గడ్డల శివచందర్ శర్మ, మండల అధ్యక్షులు సంతోష్ శర్మ,ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల శ్రీపాద రావు, ఆలయ అర్చకులు సౌమిత్ర మురళీధర ఆచార్యులు, కంజర్ల వెంకటాచార్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆల్గునూర్‌లో బోల్తాకొట్టిన కారు

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ ఆల్గునూర్ చౌరస్తాలో కారు డివైడర్ ను ఢీ కొట్టి రోడ్డు పైకి పల్టీలు కొట్టింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా సుల్తాన్ బాద్ కి చెందిన మ్యాదరి రాజు అతని తల్లిని ఆదివారం చికిత్స కోసం హైద్రాబాద్ కు వెళ్ళి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రాజు, అతని తల్లీ మరియమ్మ కు తీవ్రగాయలు కాగా చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# పెట్రోల్ ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పోరుబాట

### ప్రజల జేబులకు మంట అంటూ జగిత్యాలలో భారీ నిరసనకు పిలుపు



**ఎండపల్లి ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ఇప్పుడు రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల సామాన్య ప్రజల జీవనం కష్టసాధ్యంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా వ్యయం అధికమై, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై కూడా స్పష్టంగా కనిపిస్తోందని వారు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా రైతులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా వాహనాల నిర్వహణ ఖర్చులు పెరగడంతో వ్యవసాయ రంగంపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ ప్రయాణాలు కూడా భారంగా మారాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలకు సిద్ధమైంది. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సోమవారం జగిత్యాలలో భారీ ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ తహశీల్దార్ చౌరస్తా వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై తమ నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, పెరుగుతున్న ఇంధన ధరలు రాబోయే రోజుల్లో ప్రధాన రాజకీయ అజెండాగా మారే అవకాశముందని భావిస్తున్నారు. ప్రజల జీవన వ్యయాలపై నేరుగా ప్రభావం చూపే అంశం కావడంతో అన్ని రాజకీయ పార్టీలు దీనిపై మరింత దూకుడుగా స్పందించే పరిస్థితి కనిపిస్తోంది.

### రైల్వే ఎస్సీ, ఎస్టీ డివిజనల్ సెక్రెటరీ
## దొమ్మటి సది మహారాజ్ కన్నుమూత



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి నియోజకవర్గంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన రైల్వే ఎస్సీ, ఎస్టీ డివిజనల్ సెక్రెటరీ దొమ్మటి సది మహారాజ్ (సది) హఠాన్మరణం చెందారు. గత కొంతకాలంగా సామాజిక న్యాయం కోసం, అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం పరితపించిన ఆయన, గుండెపోటుతో ఆదివారం మరణించడం పట్ల రైల్వే ఉద్యోగ సంఘాలు, పలు ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిస్వార్థ సేవకుడిగా, అంబేద్కర్ బాటలో నడిచిన గొప్ప వ్యక్తిని కోల్పోవడం మన జాతికి తీరని లోటని పలువురు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియల్లో వివిధ సంఘాల నాయకులు పాల్గొని, సది మహారాజ్ భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు. సామాజిక మార్పు కోసం ఆయన కన్న కలలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. దొమ్మటి సది మహారాజ్ అంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ,ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్ సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ మొలుగూరి కమల్,ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మామిడిపల్లి బాపయ్య,మాజీ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు కొంకటి లింగమూర్తి, కల్లేపల్లి అశోక్ తదితరులున్నారు.

## ఘనంగా మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**మానకొండూర్,ప్రభాతవార్త :** మానకొండూరు మండల కేంద్రంలో ఆదివారం టి పి సి సి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని పల్లె మీద బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో శ్రీనివాస్ రెడ్డి, రవీంద్ర చారి, మండల కాంగ్రెస్ నేతలు కలిసి కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి



**చందుర్తి/ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన మల్యాల అజయ్ (20) అనే యువకుడు మండల కేంద్ర శివారులో మోత్కూరావుపేట రహదారిలో దుర్గమ్మ ఆలయ సమీపంలో గల బావిలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు, యువకుడి ఆచూకీ కోసం పోలీసులు రిస్క్ టీం సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి రాత్రి శవాన్ని బయటకు తీశారు, యువకుడు బావి లోపల బురదలో కురకపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలిసింది, ఆదివారం మధ్యాహ్నం గల్లంతయిన యువకుడి కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకెలకు శవాన్ని బయటకు తీశారు, బావిలో నీళ్లు అధికంగా ఉండడంతో రెండు మోటర్ లను బిగించి నీళ్లను తొలగించి తాళ్ల సహాయంతో శవాన్ని బయటకు చేశారు, సంఘటన స్థలంలో ఎస్సై రమేష్ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు, శవాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కుమారుడు అజయ్ మృతితో తల్లిదండ్రులు శ్రీనివాస్,లక్ష్మి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి

**పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త:**



గోదావరిఖని, అశోక్ నగర్‌కు చెందిన బొజ్జ శంకరయ్య (70) వడదెబ్బతో మృతి చెందాడు. గత రెండు రోజులుగా శంకరయ్య నీరసంగా ఉండటంతో పాటు అధికంగా చెమటలు పడుతుండటంతో, అతని భార్య భాగ్యమ్మ నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం అందించింది. అయినప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోగా, ఆదివారం తీవ్రమైన వేడి కారణంగా వడదెబ్బకు గురై వాంతులు చేసుకుంటూ అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షి ంచిన వైద్యులు అప్పటికే శంకరయ్య మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి పెద్ద కుమార్తె సద్దనపు గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై రమేష్ తెలిపారు.

## ఈ పెట్రోల్ బంక్‌లో కనీస సౌకర్యాలు ఏవి ?

### -యజమాన్య ఇష్టారాజ్యాంగా నిర్వహణ

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**





చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ శ్రీ లక్షి ్మ ఫిల్లింగ్ స్టేషన్ లో వినియోగదారులకు అందించే కనీస సేవలు అందించటం లేదని పెట్రో వినియోగదారులు అంటున్నారు. వాహనాల్లో నింపే ఎయిర్ యంత్రం పనిచేయడం లేదని, పూర్తి స్థాయిలో మూత్ర శాలలు, మరుగుదొడ్డి నిర్వహణ సరిగా లేదని అంటున్నారు. అసలే వేసవి కాలం కనీసం త్రాగు నీటి వసతి లేకపోగా పెట్రోల్ వాహనం లో నింపేందుకు వసతి సౌకర్యం కూడా సరిగా లేదని అంటున్నారు. పెట్రోల్ పోసే స్థలం ఎగుడు దిగుడుగా ఉన్నదని, ఇష్టారాజ్యాంగా సిమెంట్ దిమ్మెలు అడ్డుగా ఉన్నాయని, లగేజీ తో పెట్రోల్ పోయించుకోవాలంటే నరకాన్ని చూస్తున్నామని పెట్రోల్ వాహన దారులు ప్రభాత వార్త ద్వారా ఆరోపిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు ఉన్నాయో లేవో అని సంబంధిత మండల అధికారులు తనిఖీలు నిర్వహించి తగిన శాఖపర చర్యలు తీసుకోవాలని పెట్రోల్ వినియోగ దారులు కోరుతున్నారు. ఈ బంక్ లో వృద్ధులు పెట్రోల్ పోయించుకోవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందేనని అంటున్నారు.

# ధర్మపురి వార్త

## నేడు జగిత్యాలలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలి

**ధర్మపురి,ప్రభాతవార్త**

పెట్రోల్,డీజిల్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు జగిత్యాల లోని ఓల్డ్ హై స్కూల్ నుండి ర్యాలీగా వెళ్లి,తహసీల్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని, మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున జగిత్యాల కు తరలివచ్చి,ధర్నాలో పాల్గొనాలని ప్రకటనలు ఆయన కోరారు.

## ముంజంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

### -రెండు పాడి పశువులు మృతి

**మానకొండూర్, ప్రభాతవార్త :**



మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రెండు పాడి పశువులు మంటలకు ఆహుతై మృతి చెందినట్లు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మంజంపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీధర్ అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద రెండు పశువులను రోజులాగే పశువుల గుడిసెలో కట్టేసి ఇంటికి వచ్చాడు. ప్రమాదవశాత్తు తన పొలం వద్ద మంటలు చెలరేగి 150 గడ్డి కట్టలు, పశువుల గుడిసెలో ఉన్న సూడి ఆవు, ఒక దూడ రెండు పశువులు మంటల్లో కాలీ మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రైతు, గ్రామస్తులు ఘటన స్థలం చేరుకున్నప్పటికి పాడి పశువులు మంటల్లో కాలి మృతి చెందాయని, చెలరేగుతున్న మంటల పై ఆర్పేసేందుకు నీటిని చల్లారు. శ్రీధర్ రెడ్డి వ్యవసాయ పొలం చుట్టుప్రక్కల ఎలాంటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరగలేదని, ఇదంతా కావాలనే పాత కక్షలను మనసులో పెట్టుకొని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చేసుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏదైనా కక్షలు ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలి తప్ప, పాడి పశువుల పై కక్ష చూపించడం సరికాదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారుగా రు. 90 వేల నష్టం జరిగిందని రైతు శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## రెండు గ్రామాలలో గడ్డివాములు దగ్ధం

**మానకొండూర్, ప్రభాతవార్త :** మండలంలోని రంగపేట, వెల్ది గ్రామాల సరిహద్దులో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద మంటలు చెలరేగి కొయ్యకాలలో మంటలు చేరేగుతూ సుమారుగా 500 ఎకరాలకు పైగా గడ్డివాములు పూర్తిగా దగ్ధమైనట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. రంగపేట కమాన్ నుండి వెల్ది గ్రామంలోని దంపుడు కుంట,ఆయలగుడం వరకు మంటలు చెల్లరేగుతూ గడ్డివాములు, గుడిసెలు, విద్యుత్ మోటార్లు, వైర్లు, రైతులు వేసే క్షేత్రంలో గుడిసెల్లో భద్రపరచుకున్న వ్యవసాయ పనిముట్లు, పైప్ లైన్లు పూర్తిగా మంటల్లో ఖాళీ రైతులకు భారీ నష్టం చేకూరిందని రైతులు ఆరోపించారు. కొంతమంది రైతులు పాడి పశువుల కోసం భద్రపరచుకున్న గడ్డి కట్టలు కూడా మంటల్లో కాలిపోయాయి. మంటలను ఆర్పేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. స్థానిక రైతులు అగ్నిమాపక కేంద్ర అధికారులకు సమాచారం అందించిన స్పందించడం లేదని రైతులు ఆరోపించారు.

# రోకళ్లు పగిలే ఎండలొచ్చాయ్.. భానుడి భగభగలకు జిల్లా బేజార్!

## సిరిసిల్లలో ముందే మొదలైన 'రోహిణి' ప్రతాపం!

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త




సండే... మండే... రోజు ఏదైనా తేడా లేదు. ఉదయం 8 గంటలు దాటిందంటే చాలు, భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఆకాశం నుంచి సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా రాజన్న సిరిసిల్ల జిల్లా మొత్తం ఉడికిపోతోంది. దీనికి తోడు నేటి నుంచి 'రోహిణి కార్తె' ప్రారంభం కావడంతో ప్రజల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. రోహిణి కార్తెలో రోకళ్లు పగులుతాయిఖిఖి అనేది పెద్దల సామెత. అంటే ఈ కార్తెలో ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే ఈసారి కార్తె ప్రారంభానికి ముందే జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరాయి. ఇప్పుడు అధికారికంగా రోహిణి ప్రవేశించడంతో రానున్న రోజుల్లో ఎండలు ఇంకెంత ఘోరంగా ఉంటాయోనని జిల్లా ప్రజలు, ముఖ్యంగా రైతులు, కూలీలు భయపడుతున్నారు. గడిచిన కొన్ని రోజులుగా సిరిసిల్ల పట్టణంతో పాటు వేములవాడ, ఇల్లంతకుంట, ముస్తాబాద్ తదితర మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే మొదలవుతున్న ఉక్కపోత, మధ్యాహ్నానికి వేడి గాలులుగా మారి జనాలను ఇళ్ల నుంచి బయటకు రాకుండా చేస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. వేడి గాలుల (వడగాల్పుల) తీవ్రతకు వాహనదారులు సైతం ప్రయాణాలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా మే నెలాఖరులో వచ్చే ఈ రోహిణి కార్తె దాదాపు రెండు వారాల పాటు ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఈ 15 రోజులు జిల్లా ప్రజలకు నిప్పుల మీద నడకలాగే మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోతుండటం, తాగునీటి ఎద్దడి భయాలు ముంచుకొస్తుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ప్రయాణాలు చేసేటప్పుడు తలకు రుమాలు లేదా గొడుగు తప్పనిసరిగా వాడాలి. రోహిణి కార్తె ముగిసే వరకు ప్రజలంతా స్వీయ జాగ్రత్తలు పాటించడమే ప్రస్తుతానికి ఉన్న ఏకైక మార్గం.

# పంట రైతుది.. నిర్ణయాలు పాలకులవి.. భారం మాత్రం అన్నదాతపైనే..

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటకు సరైన ధర, సరైన సమయానికి కొనుగోలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ "పంట మాత్రం రైతుది.. కానీ నిర్ణయాలు పాలకులవి.. చివరికి భారం మాత్రం అన్నదాతపైనే పడుతోంది" అని వాపోతున్నారు. విత్తనం వేసిన దగ్గర నుంచి పంట విక్రయం వరకు రైతు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఎరువుల కొరత, వర్షాభావం, పెట్టుబడి భారం, పురుగుమందుల అధిక ధరలు, కూలీల ఖర్చులు, సరైన మద్దతు ధర లేకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకులు, ప్రైవేట్ అప్పులతో సాగు చేస్తున్న రైతులు పంట చేతికొచ్చే సమయానికి మరింత ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. పంటను మార్కెట్‌కు తీసుకెళ్లిన తర్వాత కూడా రైతుల కష్టాలు తీరడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, కాంటా సమస్యలు, మిల్లుల వద్ద రోజుల తరబడి నిరీక్షణ రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. లారీల కొరతతో రైతులు తమ సొంత ట్రాక్టర్ల ద్వారానే వడ్లను రైస్ మిల్లులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అక్కడ కూడా తేమ, కాళీ భారం, నాణ్యత వంటి పేర్లతో కటింగులు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడులతో నలిగిపోయిన రైతులకు ఈ అదనపు కోతలు మరింత భారంగా మారుతున్నాయని అంటున్నారు. కొన్ని చోట్ల మిల్లుల వద్ద సరైన సదుపాయాలు లేకపోవడం, ధాన్యం నిల్వ చేసేందుకు షెడ్లు లేక వర్షానికి తడిసిపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు అధికారులు, మిల్లర్ల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కొనుగోలు



ప్రక్రియ నత్తనడకన సాగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర కాగితాలకే పరిమితమవుతోందని, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు పూర్తి స్థాయిలో లాభం అందడం లేదని అంటున్నారు. ప్రభుత్వాలు ప్రతి ఏడాది కొత్త విధానాలు, కొత్త నిబంధనలు తీసుకొస్తున్నప్పటికీ వాటి ప్రభావం నేరుగా రైతులపైనే పడుతోందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, పంట సాగు నుంచి విక్రయం వరకు ప్రతి దశలో రైతులకు స్పష్టమైన భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు అరికట్టి, మిల్లుల వద్ద అనవసర కటింగులను నిలిపివేసి, రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అని చెప్పే పాలకులు రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహిళ వారోత్సవాలను విజయవంతం చేయాలి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** మహిళ వారోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహిం చాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ మరియు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ మహిళ వారోత్సవాలపై పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ మరియు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓజా సమీక్ష నిర్వహించారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ మరియు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా మే 25 నుండి మే 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలలో ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ డి ఆర్ డి ఓ, పిడి,, మెప్మా,



బి డబ్ల్యు ఓ , ఏఈపిఆర్, ఎంపీడీవో లు, మున్సిపల్ కమిషనర్ లు, సంబంధిత అధికారులు, జిల్లా సమాఖ్య , మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యలు, ఏపీఎంలు, సీసీలు, వివో ఏ లు సమన్వయం తో ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మహిళా వారోత్సవాలను అధికారులందరు సమన్వయం చేసుకుని ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశామని షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన కార్యక్రమాలను రోజు వారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి అందరూ అధికారులు సమన్వయంతో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏవో మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి,సంక్షేమం కోసం కృషి

-కాలిపోయిన ఈతవనాలు, కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

-రాష్ట్ర వెలమ కార్పోరేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని మెట్ల చిట్టాపూర్, వెల్లుల్ల, కోనరావుపేట గ్రామాల్లో ఇటీవల అగ్ని ప్రమాదం వల్ల ఈతవనాలు కాలిపోగా..గీత కార్మికులు, గ్రామస్తులతో కలిసి ఈతవనాలను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదివారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో చరవాణి లో జువ్వాడి మాట్లాడి జరిగిన ప్రమాదం గురించి వివరించి, ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా..ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందేలా అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారని జువ్వాడి నర్సింగరావు తెలిపారు. అనంతరం కొండ్రికర్ల గ్రామ పెద్ద వాగు పై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ పాలకులు ఎన్నికల్లో గెలుపు కొరకు బ్రిడ్జి నిర్మాణం చేస్తామని బాండ్ పేపర్ రాసి ఇచ్చి మాట తప్పారని, అలాంటి మాట తప్పే సంస్కృతి మాకు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం, అభివృద్ధి సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తుందని, కొండ్రికర్ల ప్రజల దశాబ్దాల కోరిక ఈ బ్రిడ్జి నిర్మాణం అని దీనిని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. అనంతరం జగ్గాసాగర్ గ్రామంలో కొండస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులతో జువ్వాడి చరవాణిలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేందర్, సర్పంచ్ గూడూరు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, నాయకులు సుంకెట ఆనంద్, ఆరెళ్ల చిరంజీవి, పిడుగు తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే శారీరక ధారుఢ్యం... మానసిక ప్రశాంత

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:




చిన్నారులు, విద్యార్థులు, యువకులు క్రీడలలో పాల్గొనడం ద్వారానే శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలిగి జీవితంలో క్రమశిక్షణతో కూడిన పరిపక్వతతో రాణించి ఉన్నత స్థితికి చేరుకుంటారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చొప్పదండి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానం జరుగుతున్న సిపిఎల్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత 15 రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు చివరి దశకు చేరుకొని ఫైనల్ మ్యాచ్ మునిసిపల్ పరిధిలోని ఒకటో వార్డు, 12వ వార్డు ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ ఫైనల్ మ్యాచ్ లో ఒకటో వార్డు విజయం సాధించి విన్నర్ కపును కైవసం చేసుకోంది. 12వ వార్డు రన్నర్ కప్ తో సంతృప్తి పడాల్సి వచ్చింది. విన్నర్, రన్నర్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇరు జట్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, కౌన్సిలర్లు కొట్టే సునీత అశోక్, కనుమల్ల రాజశేఖర్, వడ్లూరు అనూష శ్యాంసుందర్, ఒలుగొత్తుల సురేష్, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజిత్ రెడ్డి, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి, నిర్వాహకులు రాజిరెడ్డి, శ్రవణ్ కుమార్, సందీప్ తో పాటు పలువురు పాల్గొన్నారు.